



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు

నేడే ఫైనల్స్

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఫైనల్స్ శనివారం విజయవాడలో జరగనున్నాయి. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కలిపి మొత్తం 15 మంది పాల్గొంటారు. ఫైనల్స్‌లో ప్రథమ, ద్వితీయ బహుమతులతో పాటు కన్సొలేషన్ బహుమతులు ఉంటాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని 83 కేంద్రాల్లో ఈనెల 4, 5, 6, 7 తేదీల్లో పోటీలు నిర్వహించగా, వేలాదిగా మహిళలు పాల్గొన్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల స్థాయిలో విజేతలుగా నిలిచిన మహిళలు రాష్ట్రస్థాయిలో జరిగే ఫైనల్స్‌కు అర్హత సాధించారు. గత ఆదివారం విజయవాడలో జరిగిన ముగ్గుల పోటీల్లో విజేతగా నిలిచిన కె.మల్లేశ్వరి ఈ ఫైనల్స్‌లో పాల్గొంటున్నారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

అత్యవసర సేవలకు అడ్డుగా..

6

మచిలీపట్నం మెడికల్ కళాశాలకు అవరోధంగా రైల్వేట్రాక్

మచిలీపట్నంలోని మెడికల్ కళాశాల నిర్మాణానికి బాలారిష్టాలు తొలగట్లేదు. సెప్టెంబరు నుంచి 150 మంది విద్యార్థులతో ఇక్కడ ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభమైనప్పటికీ కీలకమైన మౌలిక వసతులతో పాటు కళాశాలకు వెళ్లేందుకు ప్రధాన అడ్డంకిగా ఉన్న రైల్వేట్రాక్‌పై ఫ్లై ఓవర్ నిర్మాణం పెండింగ్‌లోనే ఉండిపోయింది. దీంతో ఈ కళాశాలకు రావాల్సిన అత్యవసర వైద్యసేవలు కలగానే మిగిలిపోయాయి.

- ఫ్లై ఓవర్ నిర్మాణ ప్రతిపాదనలున్నా.. అమలు సున్నా..
- కళాశాలకు వెళ్లాలంటే ట్రాక్ దాటాల్సిందే..
- అత్యవసర వైద్యసేవలు అందని దుస్థితి
- వంతెన నిర్మాణం తర్వాతే కీలక వైద్యసేవలు



మెడికల్ కళాశాలకు వెళ్లే రహదారిలో రైల్వేట్రాక్

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : రూ.550 కోట్ల అంచనాతో నిర్మిస్తున్న మచిలీపట్నంలోని మెడికల్ కళాశాలకు వెళ్లేందుకు రైల్వేట్రాక్ అడ్డుగా మారింది. ఈ కళాశాలకు వెళ్లాలంటే రైల్వేట్రాక్ దాటాలి. మరో మార్గం లేదు. ఈ ట్రాక్‌పై ఫ్లైఓవర్ నిర్మిస్తేనే మెడికల్ కళాశాలలో అత్యవసర వైద్యసేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది.

ప్రధాన అవరోధం

కళాశాలకు 700 మీటర్ల దూరంలోనే రైల్వేట్రాక్ ఉంది. మచిలీపట్నం నుంచి వివిధ ప్రాంతాలకు రైళ్ల రాకపోకల సమయంలో ఇక్కడి గేటు పడుతుంది. 2023, మే 22న మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనులను ప్రారంభించేందుకు వచ్చిన సమయంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్.. ట్రాక్‌పై ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.25 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అయితే, ఇంతవరకు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఫ్లైఓవర్ నిర్మించాలంటే రైల్వేశాఖ నుంచి అనుమతులు పొందాలి. వారి పర్యవేక్షణలోనే ఫ్లైఓవర్ నిర్మించాలని మెడికల్ కళాశాల అధికారులు చెబుతున్నారు. అయితే, ఇంతవరకు రైల్వేశాఖ అధికారులు ఈ ప్రాంతానికి వచ్చి పరిశీలన చేసింది లేదు. ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించినఅంశం ఇటీవల మరుగునపడిందని అధికారులే చెబుతున్నారు.

వైద్యసేవలు ప్రారంభమయ్యేనా..?

ప్రస్తుతం మెడికల్ కళాశాలలో 300 మంది విద్యార్థులు ఎంబీబీఎస్ మొదటి, రెండో సంవత్సరం చదువుతున్నారు. దీంతో మెడికల్ కళాశాలలో వైద్యసేవలను కూడా ప్రారంభించాల్సి ఉంది. ప్రస్తుతం దూరంగా ఉన్న ప్రభుత్వాసుపత్రిని మెడికల్ కళాశాలకు అనుబంధంగా సర్వజన ఆసుపత్రిగా నడుపుతున్నారు. గుండె, ఇతరత్రా మెరుగైన వైద్యసేవలు ఇక్కడ ఇంకా ప్రారంభం కాలేదు. మెడికల్ కళాశాలలో ఈ తరహా వైద్యసేవలు ప్రారంభిస్తే అత్యవసర వైద్యసేవలు పొందేవారు తప్పనిసరిగా వస్తుంటారు. అత్యవసర సమయంలో రైల్వేలైన్ వద్ద గేటు పడితే రోగుల పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఫ్లైఓవర్ నిర్మాణం జరిగే వరకు ప్రసూతి, గుండెజబ్బులు, ఇతర అత్యవసర వైద్యసేవలు మెడికల్ కళాశాలలో ప్రారంభించే అవకాశం లేదని మెడికల్ కళాశాల, వైద్యశాఖ అధికారులు చెబుతున్నారు.

తాగునీరు ఎప్పటికో..

మెడికల్ కళాశాలలో తాగునీటి వసతి లేదు. మంచినీటి సరఫరాకు సంబంధించిన ఓవర్‌హెడ్ ట్యాంకు, సంప్, పైపులైన్ నిర్మాణం పనులు చేసేందుకు రూ.8.40 కోట్లతో గతంలో అంచనాలు రూపొందించారు. ఈ ప్రతిపాదనలు ఎక్కడున్నాయో తెలియదు. తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలనే అంశానికి గత ఏడాది మునిసిపల్ కార్పొరేషన్ పాలకవర్గం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం రోజువారీ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నట్లుగా చెబుతున్నా, అవి ఏ మూలకూ సరిపోవట్లేదు. కళాశాలలో వైద్యసేవలు ప్రారంభమైతే నిత్యం తాగునీరు అందుబాటులో ఉండాలి. దీంతో పాటు ఆసుపత్రిలో అన్ని అవసరాల కోసం నీరు ఉండాలి. తాగునీటి వసతికి సంబంధించిన పనులను ఎప్పటికి ప్రారంభిస్తారు, ఎప్పటికి పూర్తి చేస్తారనే అంశంపై సందిగ్ధం నెలకొంది. మెడికల్ కళాశాలకు తాగునీటి సరఫరా కోసం రైల్వేట్రాక్ కింద నుంచి పైపులైన్ వేయాలి. దీనికి కూడా రైల్వేశాఖ అనుమతి కావాలి.

ముక్కోటి.. భక్తకోటి





ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లాలోని వైష్ణవాలయాలకు భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయాలు కిక్కిరిసిపోయాయి. స్వామివారిని ఉత్తరద్వారం నుంచి దర్శించుకున్న భక్తులు తన్మయత్వం పొందారు. చల్లపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తుల క్యూ రోడ్డుపైకి చేరింది. స్వామివారు విశేష అలంకరణలో దర్శనమిచ్చారు.

మరో రూ.2818.21 కోట్లతో రాజధాని టెండర్లు

- రాజధాని అమరావతి నిర్మాణంలో ప్రభుత్వం మరో ముందడుగు

6లో

ఏ ఒక్క ప్రయాణికుడినీ విడిచివెళ్లొద్దు

- ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ

గ్రావెల్ దందా!

పోలవరం మట్టి తవ్వేస్తున్నారు

- ప్రజాప్రతినిధుల అనుచరులే సూత్రధారులు
- కొత్త క్వారీలకు అనుమతులు ఇవ్వని ప్రభుత్వం
- అయినా తిరువూరు, మైలవరంలో జోరుగా తవ్వకాలు
- గన్నవరం,నూజివీడు నియోజకవర్గాల్లో తమ్ముళ్ల పోరు



మైలవరం మండలం వెదురుబీడులో అక్రమ తవ్వకాలు జరిగిన ప్రాంతం

టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా క్వారీలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. కానీ ఎన్టీఆర్ జిల్లాలోని తిరువూరు, మైలవరంలోయథేచ్ఛగా గ్రావెల్, పోలవరం మట్టిని తవ్వి తరలించేస్తున్నారు. వైసీపీ హయాంలో కనిపించిన కొండనల్లా పిండి చేసిన అక్రమార్కులు టీడీపీ హయాంలోనూ రెచ్చిపోతూ ఈ దందాను యథేచ్ఛగా సాగిస్తున్నాయి.

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో రెచ్చిపోయిన మట్టి రాక్షసులు కూటమి ప్రభుత్వంలోనూ రూపం మార్చుకుని దోపిడీ సాగిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున గ్రావెల్ దందా నడుస్తోంది. సాక్షాత్తు ప్రజాప్రతినిధుల పేరు చెప్పి అక్రమార్కులు గ్రావెల్ దందా సాగిస్తున్నారు. మరోవైపు గన్నవరం, నూజివీడు నియోజకవర్గాల్లో పోలవరం మట్టి కోసం ప్రజాప్రతినిధుల అనుచరుల నడుమ యుద్ధం నడుస్తోంది. వైసీపీ హయాంలో కనిపించిన కొండనల్లా పిండి చేసిన అక్రమార్కులు టీడీపీ హయాంలోనూ రెచ్చిపోతున్నారు. నాడు వైసీపీ ముసుగులో దోపిడీ సాగిస్తే నేడు టీడీపీ ముసుగులో దందా నడిపిస్తున్నారు. ఆ వివరాల్లోకి వెళితే.. మైలవరం మండలం వెదురుబీడెంలో వైసీపీ నాయకుడు ఒకరు గతంలో మూడు ఎకరాల్లో గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు తెచ్చుకున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో ప్రస్తుతం ఈ ఒక్క క్వారీయే అధికారికంగా నడుస్తోంది. దాని నుంచి విజయవాడ పశ్చిమ బైపాస్ పనులకు గ్రావెల్ తరలిస్తున్నారు. ఈ క్వారీలో నిబంధనలకువిరుద్ధంగా సుమారు 20 అడుగుల మేర గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారు. 200 లారీల గ్రావెల్ తరలిస్తున్నారు. గత వారం రోజులుగా విజయవాడ రూరల్ మండల పరిధిలోని కొత్తూరు తాడేపల్లిలో స్థానిక వైసీపీ, టీడీపీ నాయకులు కలిసి పోలవరం కాల్వ మట్టిని తవ్వి తరలించేస్తున్నారు. వందల సంఖ్యలో వాహనాల్లో మట్టి తరలిపోతున్నా ఒక్క అధికారీ అటువైపు కన్నెత్తి చూడటం లేదు. స్థానికుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో అరకొరగా తనిఖీలు చేసి మమ అనిపిస్తున్నారు. పాతపాడు వద్ద కూడా పోలవరం మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. కొత్తూరు తాడేపల్లిలోని వసంతరాయల తిప్ప(కొండ)ను ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వేస్తున్నారు. తిరువూరు నియోజకవర్గ పరిధిలోని కొండపర్వలో ప్రైవేటు వ్యక్తులకు చెందిన మామిడి తోటలో గుట్టుగా తవ్వకాలు జరుపుతున్నారు. ఇక్కడి నుంచి నిత్యం వందలాది లారీల్లో గ్రావెల్ తరలిస్తున్నారు. వైసీపీ, టీడీపీ నాయకులు కలిసి గ్రావెల్ దందా నడిపిస్తుండటం గమనార్హం.

తమ్ముళ్ల నడుమ మట్టి చిచ్చు

గన్నవరం, నూజివీడు సరిహద్దు గ్రామాల్లో గ్రావెల్, పోలవరం మట్టి తవ్వకాలు, తెలుగు తమ్ముళ్ల మధ్య చిచ్చు పెడుతున్నాయి. పోటాపోటీగా ప్రెస్‌మీట్లు పెట్టుకుని పరస్పరం దుమ్మెత్తి పోసుకుంటున్నారు. నూజివీడు నుంచి గన్నవరంలోకి గ్రావెల్, మట్టితో వచ్చే లారీలను అడ్డుకుంటున్నారు. నూజివీడు నియోజకవర్గంలోని కనసానపల్లిలో ఆర్ఎస్ నంబరు 117 నుంచి అడ్డగోలుగా గ్రావెల్ తవ్వి తరలించేస్తున్నారు. 2017-18లో ఈ క్వారీకి అనుమతి తీసుకున్నారు. ఏడు ఎకరాలకు అనుమతి తీసుకుని ప్రస్తుతం 14 ఎకరాల వరకు తవ్వేశారు. సమీపంలోని డీఫారం పట్టాలు సైతం కొనుగోలు చేసి అక్రమ క్వారీయింగ్ చేస్తున్నారు. పాత రశీదులను చూపి, క్వారీయింగ్ చేస్తున్నా అధికారులు పట్టించుకున్నది లేదు. అక్కడ తవ్విన గ్రావెల్‌ను గన్నవరం నియోజకవర్గంలోని వెంచర్లకు, విజయవాడ రూరల్ ప్రాంతాల్లోని వెంచర్లకు తరలిస్తున్నారు. గన్నవరం నియోజకవర్గంలో క్వారీయింగ్‌ను పూర్తిగా నిలిపివేశారు. ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న లారీలను స్థానిక నేతలు అడ్డుకుంటున్నారు. పైగా అక్రమ క్వారీయింగ్ చేసే వారంతా వల్లభనేని వంశీ అనుచరులు, గతంలో వైసీపీలో చురుగ్గా ఉన్న వారు కావడంతో గన్నవరం నియోజకవర్గ తెలుగు తమ్ముళ్లు కత్తులు నూరుతున్నారు.

బరి తెగింపు!

- మామిడి తోటల్లో చకచకా ఏర్పాట్లు
- కేసినోను తలపిస్తూ ఏర్పాట్లు
- వీక్షకుల కోసం ప్రత్యేక గ్యాలరీలు
- లక్షల్లో చేతులు మారుతున్న నగదు
- విజేతలకు బుల్లెట్ ఆఫర్లు!
- కూటమి, వైసీపీ నేతల మిలాఖత్
- నిస్సహాయస్థితిలో రెవెన్యూ, పోలీసులు

8లో



ఆపాదమస్తకం పుస్తకం

- పుస్తక మహోత్సవానికి భారీగా తరలివస్తున్న విద్యార్థులు
- సందడిగా సదస్సులు, పుస్తకావిష్కరణలు

6లో

బియ్యం కేసులో నిందితుల విచారణ

- హైకోర్టు ఆదేశాల మేరకు మళ్లీ జైలుకు
- బందరు సబ్‌జైలు నుంచి తాలూకా పోలీస్ స్టేషన్‌కు తరలింపు
- విచారణ మొత్తం వీడియో తీసిన అధికారులు
- మాజీ మంత్రి పేర్ని నాని గోడౌన్ వ్యవహారం

6లో

జ్ఞాన ప్రపంచంలోకి తీసుకెళ్లే కిటికీలు పుస్తకాలు



హాస్టల్ కథలు సంపుటి ఆవిష్కరణలో పెనుగొండ లక్ష్మీనారాయణ, కోటేశ్వరరావు తదితరులు

చరిత్రను చెప్పేది సాహిత్యం

విజయవాడ కల్చరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తుల ఆలోచనలు, అనుభూతులు, వాస్తవ జీవితాలను భావితరాలకు సాహిత్యం ద్వారా తెలియజేస్తుందని, తద్వారా చరిత్రలో సాహిత్యం ఖాళీలను పూర్తిచేస్తుందని అరసం అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. పుస్తక మహోత్సవంలో నక్కా విజయరామరాజు రచించిన ప్రపంచంలో 'హాస్టల్ కథలు' కథాసంపుటిని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొన్ని దశాబ్దాల క్రితం గుంటూరు మెడికల్ కాలేజీ చుట్టుపక్కల చిన్న ప్రాంతంలో జరిగిన ఘటనలను రచయిత హృద్యంగా వర్ణించారన్నారు. సభాధ్యక్షుడు కోయి కోటేశ్వరరావు మాట్లాడుతూ, నక్కా విజయకుమార్ అనతికాలంలోనే తెలుగు పాఠకుల హృదయాలలో ముద్రవేసిన రచయితగా ఎదిగారన్నారు. చల్లపల్లి స్వరూపరాణి మాట్లాడుతూ, హాస్టలు జీవితాన్ని ఎంతో హృద్యంగా, ఆకర్షణీయంగా వర్ణించిన ఈ రచన హాస్టల్లో చదవనివారిని అసూయాపరులను చేస్తుందన్నారు. గడ్డం విజయసారథి మాట్లాడుతూ, చిన్నచిన్న పదాలతో సహజమైన నుడికారంతో పాఠకుల హృదయాలను మెలిపెట్టే భావాలను వెల్లడించడం రచయిత గొప్పదనం అన్నారు. మల్లవరపు ప్రభాకరరావు మాట్లాడుతూ, హాస్టల్ నేపథ్యంగా ఆనాటి సామాజిక పరిస్థితులకు చక్కగా అద్దంపట్టాయని, అదే సమయంలో ఒక సార్వకాలనీత ఉంటుందంటున్నారు. నూకతోటి రవికుమార్ మనుషుల్లో మానసిక ఆర్ద్రత పెంచేందుకు, మానవీయ విలువలు పెంపొందించేందుకు నక్కా విజయ రామరాజు కథలు ఉపయోగపడతాయన్నారు.

విజయవాడ కల్చరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పుస్తకాలు వ్యక్తులను జ్ఞాన ప్రపంచంలోకి తీసుకెళ్లే కిటికీలని సమగ్ర శిక్షా అభియాన్ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు అన్నారు. విజయవాడ పుస్తకమహోత్సవంలో శుక్రవారం నేషనల్ బుక్ ట్రస్ట్ సభలో 'ఫలహారాల చెట్టు, పుత్తడి బొమ్మతో స్నేహం, మాట్లాడే గడియారం, చిక్కుముడి' అనే అనువాద బాలసాహిత్య రచనలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్వశిక్షా అభియాన్ పాఠశాల గ్రంథాలయాల్లో బాలలకు అవసరమైన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉంచడానికి ప్రయత్నిస్తోందన్నారు. పిల్లల పుస్తకాల్లో నేషనల్ బుక్ ట్రస్ట్ ప్రమాణాలు అందరికి ఆదర్శమన్నారు. ఈ పుస్తకాల వినియోగంపై ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన పెంచాల్సి ఉందన్నారు. సభకు అధ్యక్షత వహించిన నేషనల్ బుక్ ట్రస్టు కార్యవర్గ సభ్యుడు జి.వల్లీశ్వర్ మాట్లాడుతూ, దేశ సమగ్రత, సమైక్యతను కాపాడటానికి నేషనల్ బుక్ ట్రస్టు విస్తృతమైన కృషి చేస్తోందని వివరించారు. త్వరలోనే రాష్ట్రంలో నేషనల్ బుక్ ట్రస్ట్ అతి పెద్ద బుక్ ఫెయిర్ నిర్వహించబోతోందని వెల్లడించారు. నేషనల్ బుక్ ట్రస్ట్ దక్షిణ ప్రాంత బాధ్యుడు పత్తిపాక మోహన్ మాట్లాడుతూ, పిల్లల కోసం తమ సంస్థ అనేక వర్క్‌షాపులు నిర్వహిస్తోందన్నారు. బాలసాహితీవేత్త ముంజులూరి కృష్ణకుమారి మాట్లాడుతూ, పిల్లలకు ఆసక్తి కలిగించేలా పుస్తకాలను ముద్రించాలని ప్రచురణకర్తలకు సూచించారు. పిల్లలకు కథలు పుస్తకాలు చదివే అలవాటు చేస్తే మొబైల్ తదితర దురలవాట్లు తగ్గుతాయని చెప్పారు. బాలసాహితీవేత్త అమరవాది నీరజ మాట్లాడుతూ, నేషనల్ బుక్ ట్రస్ట్ అనువాద రచనలు చదవడం వల్ల పిల్లల మనసులు, ఆలోచనలు వికసితమవుతాయని, వారికి దేశంలోని వివిధ ప్రాంతాల సంస్కృతులపై అవగాహన ఏర్పడుతుందన్నారు. వీబీఎఫ్ఎస్ అధ్యక్షుడు కె.లక్ష్మయ్య మాట్లాడుతూ, నేషనల్ బుక్ ట్రస్టు ఆంధ్రప్రదేశ్‌లో శాఖను స్థాపించాలని కోరారు. సర్వశిక్షాఅభియాన్ వారు ప్రభుత్వేతర ప్రచురణకర్తల పుస్తకాలను కొనే అవకాశాలను పరిశీలించాలన్నారు.




సమగ్ర శిక్షా అభియాన్ పీడీ శ్రీనివాసరావు, తదితరులు



స్వీయ రచనలకూ డిమాండ్!

విజయవాడ కల్చరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ బుక్ ఎగ్జిబిషన్‌లో సాహిత్య విభాగంలో ఎక్కువగా కథల పుస్తకాల హవా నడుస్తోంది. కథలు రాసిన రచయితలే స్వయంగా పుస్తకాలు వేసుకొని విక్రయాలకు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత, రచయిత వేంపల్లె షరీఫ్ తన తాజా కథల పుస్తకం 'చారల పిల్లి' గురించి వివరించారు. ఈ కాలానికి తగ్గట్టుగానే ఇప్పటి రచయితలు కథాంశాలు ఎంచుకొని రాస్తున్నారు. మారిన కాలంలో పెరిగిన జీవన వేగం, ఒత్తిళ్లు, స్త్రీ పురుష సంబంధాలు, పెరిగిన మతనమ్మకాలు వంటి అంశాలను తన కథల పుస్తకం 'చారలపిల్లి'లో వివరించాను. కథన పద్ధతిలోను కొంత కొత్తదనం పుస్తకంలో వుంది. తక్కువకాలంలో ఎక్కువ కాపీలు 'చారలపిల్లి' అమ్ముడుపోయింది. ప్రచురణకర్తలు వేసిన పుస్తకాలతో పాటు రచయితలే స్వయంగా వేసుకొన్న పుస్తకాలకూ ఈ బుక్ ఎగ్జిబిషన్‌లో మంచి అమ్మకాలు వున్నాయి. స్టాల్ నెం.42, 43, 44 రచయితల కోసం కేటాయించగా అందులో బాగా అమ్ముడుపోతున్న పుస్తకాల్లో రచయిత వైష్ణవి శ్రీ - అటుగా వంగిన ఆకాశం, నువ్వు వెళ్లే దారిలో కవితలు, చలపాక ప్రకాష్ - విజయవాడ దర్శనం, చలపాక నానీలు, అప్పగింతలు, సీహెచ్ శర్మ - కాలం చెప్పిన కథలు, శర్మ శతకం, సోమేపల్లి వశిష్ఠ - ఆకురాలిన చప్పుడు, నాని- 'నా' నానీలు, సుభాని-సామాజిక నానీలు, మేరీ కృపా భాయి-కథామంజరి, సీహెచ్ భవానీదేవి-సృజన కాంతి, భవానీ కవిత్వం, తల్లి నీకు తలవంచి లాంటి రచనలు బాగా అమ్ముడవుతున్నాయి.



భక్తి గ్రంథాల నిలయం.. 'భారతీ గ్రంథమాల'

విజయవాడ సిటీలైఫ్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మ, పద్మ, స్కాంద ఇవన్నీ పురాణాలు. శైవం, వైష్ణం, శాక్తా ఇవన్నీ ఆగమాలు. అష్టాధ్యాయి, వేదాంత ఇవన్నీ శాస్త్రాలు. వీటితో పాటు దేవీ భాగవతం, కార్తీకపురాణం, శివానందలహరి, గోవిందనామాలు, శ్రీ వేంకటేశ్వర మహత్యం వంటి ఆధ్యాత్మిక గ్రంథాలకు నిలయంగా భారతీ గ్రంథమాల ఉంది. పుస్తక మహోత్సవంలో స్టాల్ నంబరు 171లో ఈ ఆధ్యాత్మిక గ్రంథాలు అందుబాటులో ఉన్నాయి. ఆధ్యాత్మిక భావజాలం ఉన్నవారు, సీనియర్ సిటిజన్లు ఈ పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. నిత్య పూజా విధానం, వ్రతాలకు సంబంధించి పుస్తకాలు ఈ స్టాల్‌లో కొలువు దీరాయి.



అక్కడ అన్నీ అంబేడ్కర్ ఆలోచనలే

నాటి సమాజంలో ఉన్న పరిస్థితులను పూర్తి అధ్యయనం చేసి బహుజనుల జీవితాల్లో వెలుగులు నింపిన జ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్. ఆయన జననం నుంచి మరణం వరకు సాగిన ప్రస్థానంపై అనేక రచనలు వెలువడ్డాయి. అదేవిధంగా అంబేడ్కర్ కలం నుంచి వెలువడిన అక్షరాలు అనేకంగా ఉన్నాయి. ఇవన్నీ పుస్తక మహోత్సవంలోని స్టాల్ నంబరు 210లో ఉన్న జై భీమ్ బుక్‌హౌస్‌లో దర్శనమిస్తున్నాయి. అంబేడ్కర్ జీవనం, అంబేడ్కర్ జీవితచరిత్ర, జై భీమ్, అంబేడ్కర్ సూర్యుడు వంటి పుస్తకాలు ఇందులో ఉన్నాయి. వాటితో పాటు ఆయన అనుసరించిన బౌద్ధంకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.



నీతి కథల పుస్తకాలంటే ఇష్టం

– పి.జగదీష్, గీతాంజలి హైస్కూల్



నేను ఎనిమిదో తరగతి చదువుతున్నా. నాకు నీతికథల పుస్తకాలంటే చాలా ఇష్టం. మా స్కూల్‌లో వారానికి ఒకసారి లైబ్రరీ పిరియడ్ ఉంటుంది. ఆ సమయంలో ఈ పుస్తకాలను చదువుతాను. వాటితోపాటు సుభాష్‌చంద్రబోస్, గాంధీజీ, అంబేడ్కర్ వంటి నాయకుల జీవిత చరిత్రకు సంబంధించి పుస్తకాలు చదివా. తెనాలి రామకృష్ణ కథలపై ఆసక్తి ఉంది.

రూ.50కే.. 101 పుస్తకాలు

తెలివైన కోడి, నల్లపిల్లి - తెల్లపిల్లి, తోడేలు తెలివి, ముందుచూపు, భలేగుడ్డు, తెలివైన తాబేలు ఇదంతా బాల సాహిత్యం. ఇవన్నీ పిల్లల కథల పుస్తకాలు. ఒకప్పుడు పిల్లలకు పేదరాసి పెద్దమ్మ, ఒక రాజుకు ఏడుగురు కొడుకులు వంటి కథలను కుటుంబపెద్దలు చెప్పేవారు. ఆధునిక యుగంలో ఈ పరిస్థితి కనిపించడం లేదు. పిల్లలతో చదివించడానికి, చదివిన కథలను చెప్పడానికి 101 కథల పుస్తకాలు పుస్తక మహోత్సవంలో ప్రత్యేకంగా ఉన్నాయి. ఈ పుస్తకాలను విజయవాణి ప్రింటర్స్ ప్రచురించింది. స్టాల్ నంబరు 31, 32లో ఈ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఈ 101 పుస్తకాలను రూ.50కే ప్రచుకరణకర్తలు విక్రయిస్తున్నారు.



పీడీస్ బియ్యం కేసులో .. నిందితుల విచారణ

- హైకోర్టు ఆదేశాల మేరకు మళ్లీ జైలుకు
- మాజీ మంత్రి పేర్ని నాని గోడౌన్ వ్యవహారం

మచిలీపట్నం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ మాజీ మంత్రి పేర్ని నాని గోడౌన్‌లో మాయమైన బియ్యం కేసుకు సంబంధించి రిమాండ్‌లో ఉన్న గోడౌన్ మేనేజర్ మానస తేజ, మిల్లు యజమాని బొర్రా ఆంజనేయులు, లారీడ్రైవర్ బోట్ల మంగారావును పోలీసులు శుక్రవారం కస్టడీలోకి తీసుకుని విచారించారు. మచిలీపట్నం స్పెషల్ సబ్‌జైలు నుంచి నిందితులను మచిలీపట్నం తాలూకా పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. మచిలీపట్నం డీఎస్పీ అబ్దుల్‌సుభాన్, ఆర్‌పేట సీఐ ఏసుబాబు, మరో ఇద్దరు సీఐలు నిందితులను విచారించారు. విచారణ చేసే సమయంలో వీడియో తీశారు. పోలీస్ అధికారులు విచారణ చేస్తుండగా నిందితులు చెప్పిన విషయాలను వీఆర్వో రికార్డు చేశారు. బియ్యం మాయం కేసులో ఈ నెల 6న నిందితులను పోలీస్ కస్టడీకి తీసుకుని విచారణ సమయంలో న్యాయవాదులను దగ్గరగానే ఉంచారు. శుక్రవారం విచారణ జరుగుతున్న సమయంలో మాత్రం దూరంగా ఉంచారు. విచారణలో భాగంగా గోడౌన్ నుంచి బియ్యం తరలించడంలో ఎవరి ప్రమేయం ఉంది? ఎవరు చెబితే చేశారు? బియ్యాన్ని ఏయే ప్రాంతాలకు తరలించారు? ఎంత ధరకు విక్రయించారనే అంశాలపై ప్రశ్నించినట్టు సమాచారం. బియ్యం విక్రయించిన తర్వాత నగదు లావాదేవీలకు సంబంధించిన అంశాలపైనా వివరాలు సేకరించారు. పేర్ని నాని, ఆయన భార్య పేర్ని జయసుధ పేర్లు ప్రస్తావనకు వచ్చిన సమయంలో గోడౌన్ మేనేజర్ మానస్ తేజ పోలీసులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పకుండా దాటవేత ధోరణితోనే వ్యవహరించి పూర్తి వివరాలు తెలపలేదని సమాచారం. బియ్యం విక్రయంలో నగదు లావాదేవీలకు సంబంధించిన అంశాలపైనా వివరాలు రాబట్టారు.

విచారణ అనంతరం మళ్లీ జైలుకు

బియ్యం మాయం కేసులో రిమాండ్‌లో ఉన్న ముగ్గురు నిందితులను రెండు రోజులపాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ మొబైల్ కోర్టు న్యాయమూర్తి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. పోలీస్ కస్టడీలోనే రెండు రోజులపాటు నిందితులు ఉండాలి. అయితే నిందితులపై పోలీసులు ఒత్తిడి తెచ్చే అవకాశం ఉందని నిందితుల తరఫున న్యాయవాదులు శుక్రవారం హైకోర్టును ఆశ్రయించారు. వారి కోరిక మేరకు నిందితులను శుక్రవారం సాయంత్రానికి సబ్ జైలుకు పంపి, శనివారం మళ్లీ కస్టడీకి తీసుకునేలా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈమేరకు సాయంత్రం నిందితులను తిరిగి సబ్ జైలుకు పంపారు.

మరో రూ.2,818.21కోట్లతో రాజధాని టెండర్లు

విజయవాడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : రాజధాని నిర్మాణంలో భాగంగా అమరావతి రాజధాని అభివృద్ధి సంస్థ మరోమారు రూ.2,818.21 కోట్ల విలువైన పనులకు భారీగా టెండర్లు పిలిచింది. వీటిలో, నేలపాడులో ఎన్జీవో గృహాలకు సంబంధించి మొత్తం 1140 అపార్ట్‌మెంట్ యూనిట్స్‌కు స్టిల్ట్ + 12 అంత స్తులతో కూడిన 12 టవర్లలో ఆర్కిటెక్చరల్ ఫినిషింగ్ వర్క్స్, ఇంటర్నల్-ఎక్స్‌టర్నల్ ఎలక్ట్రికల్ వర్క్స్, ప్లంబింగ్, శానిటరీ, లిఫ్ట్, డీజీ సెట్స్, బిల్డింగ్ సెక్యూరిటీ సిస్టమ్స్, అంతర్గత రోడ్లు, వీధి దీపాలు వంటివి ఏర్పాటు చేయటానికి రూ.607.50 కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచింది. అలాగే, మరో 855 అపార్ట్‌మెంట్ యూనిట్స్‌కు సంబంధించి స్టిల్ట్+12అంతస్తులతో కూడిన 9టవర్లకు పైన చెప్పుకున్న పనులకు రూ.594.36కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచింది. భూసమీకరణ లే అవుట్లలో రోడ్లు, డ్రెయిన్లు, వాటర్ సప్లై నెట్‌వర్క్, యుటిలిటీ డక్ట్స్ వంటివి ఏర్పాటు చేయటానికి రూ.1,085.68 కోట్ల వ్యయంతో ఏడీసీ టెండర్లు పిలిచింది. భూ సమీకరణ లే అవుట్లలో పైన చెప్పుకున్న పనులు చేసేందుకు మరో 530.83 కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచింది. అఖిలభారత సర్వీసు అధికారులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లకు సంబంధించి చేపట్టాల్సిన బ్యాలెన్స్ పనుల కోసం ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ ఏర్పాటుకు టెండర్లు పిలిచింది.



ఏ ఒక్కరినీ విడిచివెళ్లొద్దు

- ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చండి
- ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ

బస్‌స్టేషన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : బస్టాండ్‌లో వేచిఉండే ఏ ఒక్క ప్రయాణికుడినీ విడిచిపెట్టకుండా ఎక్కించుకోవాలని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ సూచించారు. శుక్రవారం విజయవాడ జోన్ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్రాంతిని పురస్కరించుకుని ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆయన ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి సొంతూళ్లకు చేరుకునే వారికి ఎలాంటి ఆటంకాలు రాకుండా చూడాలన్నారు. హైదరాబాద్ నుంచి సంక్రాంతి రద్దీని పురస్కరించుకుని బస్సులను పర్యవేక్షిస్తున్న సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అప్పలరాజుతో ఫోన్‌లో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌కు వెళ్లి వచ్చే డ్రైవర్లు ప్రమాదాల బారిన పడకుండా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. అవసరమైతే బస్సులను పెంచాలన్నారు. విజయవాడ, ఇతర ముఖ్య స్టేషన్లలో ప్రయాణికుల రద్దీని తగ్గించాలన్నారు. పోలీసుల సహాయం తీసుకుని ప్రైవేటు వాహనదారుల దోపిడీని నివారించాలన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు డ్రైవర్లకు, ఉన్నతాధికారులు తగిన సూచనలు చేయాలన్నారు. పొగమంచు కారణంగా ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. బస్సుల వివరాలు సమాచార కేంద్రం ద్వారా ప్రయాణికులకు అందించాలన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో సంక్రాంతి పండగ పురస్కరించుకుని 20వ తేదీ వరకు హైదరాబాద్‌కు 621, రాజమండ్రికి 235, విశాఖపట్నం 122, బెంగళూరు 37, చెన్నై 27, ఇతర ప్రాంతాలన్నింటికీ కలిపి 328, మొత్తం 1,370 ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంచినట్టు నారాయణ తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.విజయరత్నం, జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.వై.దానం పాల్గొన్నారు.



ఆర్టీసీ ఉన్నతాధికారులతో చైర్మన్ కొనకళ్ల నారాయణ సమీక్ష

అధిక ధర వసూలు చేస్తే బస్సులు సీజ్

- ప్రయివేటు ట్రావెల్స్ ఆపరేటర్లకు డీటీసీ మోహన్ హెచ్చరిక

కృష్ణలంక, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ప్రయాణికుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నట్టు మా దృష్టికి వస్తున్నాయి.. అటువంటి బస్సులపై కేసులు నమోదు చేస్తాం.. అని డీటీసీ మోహన్ హెచ్చరించారు. బందరురోడ్డులోని డీటీసీ కార్యాలయంలో ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులతో డీటీసీ మోహన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దూరపు ప్రాంతాల నుంచి ప్రయాణికుల రాకపోకలు ఎక్కువగా వుండటంతో, దానిని అదనుగా తీసుకొని కొంతమంది ప్రైవేటు బస్సు ఆపరేటర్లు ప్రయాణికుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నట్టు వార్తా పత్రికల్లో కథనాలు వస్తున్నాయని ఆయన తెలిపారు. విజయవాడ కేంద్రంగా హైదరాబాద్, చెన్నై, బెంగళూరు. విశాఖపట్నం ఇలా అనేక దూరప్రాంతాలకు ప్రైవేట్ బస్సులు వెళ్లడం జరుగుతోందని, నిర్ణీత ధరల కన్నా ఒక్క రూపాయి కూడా ఎక్కువ వసూలు చేయవద్దని బస్సు ఆపరేటర్లకు డీటీసీ సూచించారు. లేదంటే మోటారు వాహనాల చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని డీటీసీ హెచ్చరించారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా పదిమంది మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్లతో ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈనెల 8 నుంచి ప్రత్యేక బృందాలతో జిల్లాలో పలుచోట్ల తనిఖీలు చేపట్టడం జరిగిందని 20వ తేదీ వరకు తనిఖీలు కొనసాగిస్తామని తెలిపారు. ప్రయాణికుల నుంచి ఎక్కువగా చార్జీలు వసూలు చేసినట్టు తెలిస్తే ఆయా బస్సులపై కేసులు నమోదు చేయడమే కాకుండా బస్సులను సీజ్ చేస్తామని ఆయన తెలిపారు. అధిక చార్జీలు వసూలు చేసిన ప్రయాణికులకు ఇబ్బంది కలిగించినట్టయితే ఆయా బస్సులపై ఈ ఫోన్ నెంబర్ ద్వారా 9154294698 ఫిర్యాదు చేయవచ్చని డీటీసీ తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీవోలు ఆర్.ప్రవీణ్, వెంకటేశ్వరరావు, ప్రైవేటు బస్సు ఆపరేటర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీటీసీ మోహన్

శ్రీవారి అన్నప్రసాద ట్రస్టుకు రూ.2 వేల కోట్ల విరాళాలు

- 'వడ్డీతోనే అన్నప్రసాదాల వితరణ' లక్ష్యం సాకారం
- 1985లో నిత్యాన్నదాన పథకాన్ని ప్రారంభించిన ఎన్టీఆర్
- తర్వాత శ్రీవేంకటేశ్వర నిత్యాన్న ప్రసాదం ట్రస్ట్‌గా మార్పు

తిరుమల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : తిరుమల శ్రీవారి అన్నప్రసాదం ట్రస్టుకు భక్తులు అందజేస్తున్న విరాళాలు రూ.2 వేల కోట్లు దాటాయి. కొండపైన భక్తులతో పాటు తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణునివాసం, గోవిందరాజస్వామి ఆలయం, తిరుచానూరు అమ్మవారి ఆలయాల వద్ద యాత్రికులతో పాటు రుయా, స్విమ్స్, మెటర్నిటీ, బర్డ్, ఆయుర్వేద ఆస్పత్రుల వద్ద రోగుల నుంచి ఆకలి అనే మాట వినిపించకుండా అన్నప్రసాదాలను ఈ ట్రస్టు అందజేస్తోంది. శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఉచితంగా అన్నప్రసాదాలను అందజేయాలనే ఉద్దేశంతో 1985 ఏప్రిల్ 6న అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు నిత్యాన్నపథకాన్ని ప్రారంభించారు. ఇది 1994 ఏప్రిల్ 1న శ్రీవేంకటేశ్వర నిత్యాన్నదానం ట్రస్టుగా మారింది. ఆ తర్వాత శ్రీవేంకటేశ్వర నిత్యాన్నప్రసాదంగా ట్రస్టు పేరును మార్చారు. తొలుత తిరుమలలో ప్రధాన కల్యాణకట్ట వద్ద అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. ఆ తర్వాత రద్దీని దృష్టిలో పెట్టుకుని వరాహస్వామి ఆలయం వద్ద మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ నిత్యాన్న ప్రసాద భవనం పేరుతో నిర్మించిన భారీ భవనాన్ని 2011 జూలై 7న అప్పటి రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ ప్రారంభించారు. ఈ ట్రస్టుకు 1985లో తొలిసారి చెన్నైకు చెందిన ఎల్‌వీ రమణ అనే భక్తుడు రూ.10 లక్షలు విరాళంగా ఇచ్చారు. అప్పటి నుంచి భక్తులు తమ స్థాయికి తగ్గట్టు విరాళాలు అందజేసి స్వామిపై భక్తిని చాటుకుంటున్నారు. అలాగే అంబానీ వంటి ప్రముఖ పారిశ్రామిక వేత్తలు కోట్లాది రూపాయలు ట్రస్టుకు విరాళంగా ఇస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో 2018 సెప్టెంబరు నాటికి ట్రస్టుకు రూ.వెయ్యి కోట్లు చేరాయి. ఇక, తాజాగా పదిరోజుల క్రితం ఈ విరాళాలు రూ.2 వేల కోట్లు దాటాయి. ప్రస్తుతం అన్నప్రసాదాల వితరణకు టీటీడీకి ఏటా రూ.130 కోట్ల నుంచి రూ.140 కోట్లు ఖర్చవుతోంది. ప్రస్తుతం వివిధ బ్యాంకుల్లో ఉన్న ఈ రూ.2వేల కోట్ల డిపాజిట్ల ద్వారా ఏడాదికి దాదాపు రూ.140 కోట్ల వరకు వడ్డీ రానుంది. అన్నప్రసాదాల వితరణకు అయ్యే ఖర్చును ఈ వడ్డీ ద్వారానే నిర్వహించాలని టీటీడీ లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికి అది నెరవేరింది.



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

సంక్రాంతి పండుగ సందర్భంగా చర్లపల్లి - విశాఖ మధ్య జనసాధారణ్ ప్రత్యేక రైళ్లు

వన్‌టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సందర్భంగా ప్రయాణికుల రద్దీని పురస్కరించుకుని దక్షిణ మధ్య రైల్వే రిజర్వ్ చేయని జనసాధారణ్ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నది. ఈనెల 11, 13, 16, 18 తేదీల్లో జనసాధారణ్ అన్‌రిజర్వ్ స్పెషల్ రైలు (08534) చర్లపల్లి-విశాఖపట్నం మధ్య నడవనున్నది. చర్లపల్లిలో ఉదయం 8.30 గంటలకు బయలుదేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఇదే రైలు విశాఖపట్నం నుంచి 10, 12, 15, 17 తేదీల్లో నడవనున్నది. ఉదయం 9.45 గంటలకు బయలుదేరుతుంది. ఈ రైళ్లు దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్లలో ఆగుతుంది. కాగా, 08537 విశాఖపట్నం-చర్లపల్లి రైలు ఈనెల 10, 15, 16 తేదీల్లో విశాఖపట్నం నుంచి సాయంత్రం 6.20 గంటలకు బయలుదేరుతుంది. మరుసటి రోజు ఉదయం 8 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. ఈ రైలు నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్లలో ఆగటంతో పాటు దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్లలో ఆగుతుంది.



డిప్లొమాటిక్ పాస్‌పోర్టు తీసుకున్న బాబు

విజయవాడ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు డిప్లొమాటిక్ పాస్‌పోర్టు తీసుకున్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విజయవాడలోని ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయానికి వెళ్లారు. ఈ నెల 20-24 మధ్య స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక ఫోరం వార్షిక సదస్సుకు సీఎం హాజరుకానున్నారు. డిప్లొమాటిక్ పాస్‌పోర్టును రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని, సీఎం వంటి ప్రముఖులకు ఇస్తారు.

బిల్లులు చెల్లించి ఆదుకోండి!

- అప్పులతో చిన్న కాంట్రాక్టర్లకు ఇబ్బందులు
- సీఎంకు సబ్కా రాష్ట్ర అధ్యక్షుడు విజయకుమార్ లేఖ

విజయవాడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వచ్చినా రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటి వరకు చిన్న కాంట్రాక్టర్లకు ఒక్క రూపాయి కూడా బకాయి బిల్లులు విడుదల చేయకపోవటం బాధాకరమని సబ్కా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.విజయ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. బకాయి బిల్లులు చెల్లించాలని దసరా, దీపావళి పండుగల సమయాల్లోనూ ప్రభుత్వాన్ని కోరామన్నారు. సూక్ష్మ, చిన్న తరహా కాంట్రాక్టర్లకు కనీసం రూ.కోటి లోపు బిల్లులనైనా చెల్లించి ఉంటే కొంత ఉపశమనం ఉండేదని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఆ దిశగా ఆలోచన చేయాలని కోరారు. అనంతపురంలో జనార్దనరెడ్డి అనే కాంట్రాక్టర్ చనిపోవటానికి బిల్లులు చెల్లించకపోవటమే కారణమన్నారు. ఎప్పుడైనా బిల్లుల పేమెంట్ వస్తే.. ఓడీ ఖాతాలో జమ చేయటంతో ఆ కాంట్రాక్టర్ బయట అప్పులు చెల్లించకలేక, ఆర్థిక భారం తట్టుకోలేక మానసిక ఒత్తిడితో ఆత్మహత్య చేసుకున్నాడని విజయ్‌కుమార్ సీఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఇప్పుడా కుటుంబానికి దిక్కు లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలోని 3 వేల మంది కాంట్రాక్టర్ల ఇబ్బందులను అర్థం చేసుకుని బకాయిలు చెల్లించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	112,120, 131
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

చెత్త వ్యాన్ డ్రైవర్ల సమ్మెకు మద్దతుగా సీఐటీయూ నిరసన

పెనమలూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : తమ జీతాలు హామీ ఇచ్చిన ప్రకారం చెల్లించకపోవడంతో తడిపొడి చెత్త వ్యాన్ల డ్రైవర్లు సమ్మెబాట పట్టారు. వారికి మద్దతుగా మండల సీఐటీయూ నాయకులు తాడిగడప సెంటర్లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ మూడు నెలలు గడుస్తున్నా ఇంతవరకు వ్యాన్ల డ్రైవర్లకు జీతాలు చెల్లించకపోతే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు. క్రిస్మస్‌కు, డిసెంబరు 30కు, జనవరి ఏడుకు జీతాలు ఇస్తామని ఇంతవరకు నాలుగు సార్లు హామీలిచ్చి కనీసం ఒక్క నెల జీతం కూడా ఇవ్వకుండా డ్రైవర్లను మోసం చేస్తున్నారని విమర్శించారు. దీంతో కార్మికులు సమ్మెబాట పట్టడం జరిగిందన్నారు. నిరసన కార్యక్రమంలో ఉప్పాడ త్రిమూర్తులు, ఎస్కే. మస్తాన్‌వలి, నరేంద్ర, నరసింహరావు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

నందమూరులో ఆధార్ సెంటర్

ఉంగుటూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఆధార్ కేంద్రం సేవలను మండలంలోని ప్రజలందరూ వినియోగించుకోవాలని ఎంపీడీవో సత్యకుమార్ అన్నారు. మండల పరిధిలోని నందమూరు సచివాలయంలో ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను ఎంపీడీవో శుక్రవారం ప్రారంభించారు. త్వరలో తేలప్రోలు సచివాలయం-2 లో కూడా మరో ఆధార్ కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ

పెనమలూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : కానూరు అశోక్‌నగర్ ఎస్‌బీఐ ఏటీఎంలో ఇద్దరు దొంగలు రెండు లక్షలకు పైగా సొమ్మును విడతల వారీగా చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...కానూరు అశోక్‌నగర్ ఎస్బీఐ ఏటీఎంలో ఇద్దరు దొంగలు ఈనెల మూడవ తేదీ నుంచి విడతల వారీగా 2,22,700సొమ్మును దొంగిలించారు. ఈ నెల మూడు నుంచి తొమ్మిది వరకు ఇద్దరు వ్యక్తులు రాత్రిపూట ఏటీఎం వద్దకు వచ్చి ఫాల్స్ కీతో ఏటీఎం డోరును తెరిచి ఏటీఎంను స్వల్పంగా డ్యామేజీ చేసి లోపలి భాగంలో బ్లాక్ స్టిక్కర్‌ను అతికించి వెళ్లేవారు. కాసేపటి తర్వాత వచ్చి కస్టమర్లు డ్రా చేసిన డబ్బు స్టిక్కరుకు అతుక్కుపోతుండడంతో ఆ డబ్బును తీసుకెళుతుండేవారు. ఈ క్రమంలో పలువురు కస్టమర్ల నుంచి ఫిర్యాదు రావడంతో అక్కడి సీసీ ఫుటేజీని పరిశీలించగా దొంగల బండారం బయటపడింది. ఏటీఎం సేవల కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గొలుసు దొంగ అరెస్టు

హనుమాన్‌జంక్షన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : మహిళ మెడలో బంగారు గొలుసును అపహరించిన మహిళను శుక్రవారం జంక్షన్ ఎస్సై సురేష్ అరెస్టు చేసి నూజివీడు కోర్టులో హాజరు పరిచారు. గురువారం స్థానిక విజయవాడ రోడ్డులో పోలీస్ స్టేషన్‌లో ఎదురు వీధిలో నివాసం ఉంటున్న పెనుమాల ఈశ్వరమ్మ మెడలో ఆరు కాసుల బంగారం గొలుసును బాపులపాడులో నివాసం ఉంటున్న ఖమ్మం జిల్లా మణుగూరుకు చెందిన మాటూరి రాణి అపహరించుకుపోయింది. బాధితురాలు ఇంట్లో కూరగాయలు కోసుకుంటుండగా గొలుసు లాక్కుని పరారైంది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేసి సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితురాలిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

గన్నవరం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏఈ వెంకటరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నా రు. శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ గన్నవరం, మర్లపాలెం, చిన అవుటపల్లి, దుర్గాపురం, ఎయిర్‌పోర్టు సిటీ, బీబీగూడెం, గోపవరపుగూడెం, చిక్కవరం గ్రామాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు సరఫరాను నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెనమలూరు : యనమలకుదురు సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ కెనాల్ బ్యాంకు ఫీడరు పరిధిలోని లైన్‌ల మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని గుణదల డివిజన్ ఈఈ హరిబాబు తెలిపారు. ఇందిరానగర్ 2, చౌడేశ్వర కాలనీ, హైదర్‌నగర్, వినోద పాఠశాల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

ఉయ్యూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండల ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవీ సేవాదళ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆర్యవైశ్య పేదలకు శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేరెళ్ల తేజ మాట్లాడుతూ పేదలకు సాయమందించేందుకు యువజన సంఘం, వాసవీసేవాదళ్ ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందన్నారు. మండల యువజన సంఘం అధ్యక్షుడు పేరూరి నిఖిల్, వాసవీసేవాదళ్ అధ్యక్షుడు కొల్లిపర హేమంత్ పాల్గొన్నారు.

వైభవంగా ముక్కోటి ఏకాదశి

● వేకువ జాము నుంచి ఉత్తర ద్వార దర్శనానికి తరలివచ్చిన భక్తులు



ఉయ్యూరు వేణుగోపాలస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఉయ్యూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని ఉయ్యూరు, పరిసర గ్రామాల దేవాలయాల్లో శుక్రవారం ఉత్తర ద్వార దర్శన ఏర్పాట్లు చేశారు. వేణుగోపాలస్వామి, సోమేశ్వరస్వామి ఆలయాలతో పాటు ఇతర ఆలయాల్లో ఉత్తరద్వారం ద్వారా దర్శనానికి వేకువ జామునుంచి భక్తులు తరలివచ్చి పొడవాటి క్యూలైన్లలో వేచి ఉన్నారు. వేణుగోపాలస్వామి, పంచ పట్టాభిరామస్వామి ఆలయాల్లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. ఆలయ అధికారులు, పార్టీనాయకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు.

పెనమలూరు : ముక్కోటి ఏకాదశి పండుగను మండల ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. వేలాది భక్తులతో ఆలయాల పరిసరాలు కిటకిటలాడాయి. కానూరు, పోరంకి, పెనమలూరులోని వేణుగోపాలస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తాడిగడప ఎల్వీజీ గార్డెన్స్‌లోని శ్రీనివాస క్షేత్రంలో స్వామివారు గరుడ వాహనంపై భక్తులకు ఉత్తరద్వారం ద్వారా దర్శనమిచ్చారు.

గన్నవరం : మండలంలోని గ్రామాల్లో ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని శుక్రవారం వైభవంగా జరుపుకున్నారు. దావాజీగూడెం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో స్వామివారిని ఉత్తర ద్వారా దర్శనం చేసుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు.

హనుమాన్‌జంక్షన్ : ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం జంక్షన్‌లోని పలు ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి. స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ముక్కోటి సందర్భంగా ప్రత్యేకంగా ఉత్తరద్వార దర్శనం వేడుకను ఘనంగా నిర్వహించారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : మడిచర్ల, ఆరుగొలను, సింగన్నగూడెం, వీరవల్లి, తదితర గ్రామాల్లోని దేవాలయాల్లో శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విజయవాడ రూరల్ : నున్న వికాస్ కాలేజీ రోడ్డులో నూతనంగా నిర్మించిన అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు స్వామి వారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవగిరి రంగారెడ్డి, కుర్రె శ్రీనివాసరెడ్డి, భూముల బాల శేఖర్ రెడ్డి, భీమవరపు శివరామిరెడ్డి, బొంతు శ్రీనివాసరెడ్డి, దండు సుబ్రహ్మణ్యంరాజు పాల్గొన్నారు.

ఉంగుటూరు : లంకపల్లి అగ్రహారంలో కొలువైవున్న లక్ష్మీనృసింహస్వామి, కోదండ సీతారామస్వామి ఆలయాల్లో ఉత్తరద్వారం గుండా స్వామివార్లను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.



జంక్షన్ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తుల క్యూ



దావాజీగూడెం ఆలయంలో..



నున్న అభయ ఆంజనేయస్వామి ఆలయంలో..



లంగడి పోటీలను ప్రారంభిస్తున్న అసోసియేషన్ సభ్యులు

నున్నలో జాతీయస్థాయి లంగడి పోటీలు

విజయవాడ రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : నున్న జెడ్పీహైస్కూల్ గ్రౌండ్‌లో జాతీయస్థాయి లంగడి పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ లంగడి అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 14వ జాతీయస్థాయి లంగడి పోటీలను సర్పంచ్ కాటూరి సరళ ప్రారంభించారు. అండర్ - 19 బాలురు, బాలికల విభాగాల్లో జరిగిన పోటీల్లో వివిధ రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొన్నారు. నాలుగు రోజుల పాటు పోటీలు నిర్వహించి ఈ నెల 12న విజేతలను ప్రకటిస్తామని నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లంగడి అసోసియేషన్ సభ్యులు ఏ. గాంధీ, సురేష్, లక్ష్మీ వెంకటేశ్వరరావు, అరవ రమేష్, శివరామ్ తదితరులు పాల్గొన్నారు.


సేవా సదనం నిర్మాణానికి విరాళాలు అందజేత

గన్నవరం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పాత గన్నవరంలోని తిరుపతమ్మ ఆలయ సేవా సదనం నిర్మాణానికి అమెరికాకు చెంది దొండపాటి రాజ్యలక్ష్మీ, వెంకట రాజేష్ దంపతులు వారి అమ్మమ్మ, తాతగారైన పాలడుగు వెంకటేశ్వర రావు, పుణ్యవతి జ్ఞాపకార్థం రూ.లక్ష, మరో ఎన్నారై కిలారు కవితా శ్రీనివాస్ దంపతులు వారి తల్లిదండ్రులైన కొమ్మ రామ్మోహనరావు, శేషగిరి దంపతుల తరుపున రూ.లక్ష విరాళాన్ని శుక్రవారం ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్‌కు అందజేశారు. కాసన్నేని నాని, పోట్ల శివలీల, జాస్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై రెవెన్యూ అధికారుల దాడి

విజయవాడ రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : నున్న గ్రామ శివారుల్లో అర్ధరాత్రి జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరుపుతున్న వ్యక్తుల నుంచి జేసీబీని స్వాధీన పరచుకున్నారు. గురువారం అర్ధరాత్రి నున్న గ్రామంలోని పోలవరం కాలువ మట్టిని అక్రమంగా తరలిస్తున్నట్లు ఎమ్మార్వో సుగుణకు సమాచారం అందింది. ఎమ్మార్వో ఆదేశాల మేరకు తవ్వకాలు జరుపుతున్న ప్రాంతానికి అధికారులు వెళ్లగా అక్రమ మైనింగ్ నిర్వహిస్తున్న వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు. తవ్వకాలు జరుపుతున్న జేసీబీ అక్కడే వదిలివేయడంతో అధికారులు స్వాధీనపరచుకుని నున్న రూరల్ పోలీసులకు అప్పగించారు.

ప్రముఖ ట్రాన్స్‌పోర్టర్ కనుమూరి చిన్నరాజు మృతి



కనుమూరి చిన్నరాజు

హనుమాన్‌జంక్షన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక లారీ ఓనర్సు అండ్ వర్కర్సు అసోసియేషన్ సీనియర్‌నేత, ప్రముఖ ట్రాన్స్‌పోర్టర్ కనుమూరి సూర్యనారాయణరాజు (చిన్నరాజు) (89) శుక్రవారం మృతి చెందారు. ఐదుగురు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. ఆయన రెండవ కుమారుడు సుబ్బరాజు (రాజాబాబు) గత వైసీపీ పాలనలో ఆర్టీసీ ఛైర్మన్‌గా పనిచేశారు. చిన్నరాజు కుటుంబ సభ్యులు ఇటీవల వైజాగ్‌లో నిర్వహించిన హోమంలో పాల్గొనడానికి వెళ్లారు. అక్కడ అనారోగ్యానికి గురికాగా విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. శనివారం జంక్షన్‌లో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



తహసీల్దార్ కేవీ శివయ్యకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

గన్నవరం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఇంటి నిర్మాణానికి రూ.4లక్షలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కేవీ శివయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు కొండా వీరాస్వామి, తిరివీధి సుబ్బరావు, మన్నెం గోపాలకృష్ణ, విజయరావు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతోనే అపరాల్లో అధిక దిగుబడి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి) : రబీ అపరాలు(మినుము, పెసర)సాగులో సరైన సమయంలో సస్యరక్షణ చర్యలు పాటిస్తూ పురుగుమందులను తక్కువగా వాడటం ద్వారా నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి భవాని రైతులకు సూచించారు. వీరవల్లిలో పెసర, మినుము పంటలను క్షేత్ర స్థాయిలో శుక్రవారం పరిశీలించారు. అపరాల్లో తెగుళ్ల బెడదను తట్టుకునేందుకు రైతులకు పలు సూచనలు చేశారు. వీఏఏ లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, లలిత, రైతులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

గన్నవరం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : నిత్యం టక్ చేసుకుని శతస్కోపుతో వైద్య సేవలు అందించే వైద్యులు, వైద్య విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో మెరిశారు. గంగిరెద్దులు, గొబ్బెమ్మలు, రంగవల్లులు, కొబ్బరి పూరిళ్ళు, చెరుకు గడలు, పూలదండలు, కోడిపుంజులు, హరిదాసుని గేయాలతో మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాల ప్రాంగణం పల్లె పండుగ సంక్రాంతి మకర తోరణంతో వెల్లివిరిసింది. కళాశాలల్లో శుక్రవారం సంక్రాంతి సంబరాలను అంబరాన్నంటేలా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు భోగి మంటలు వేసి సంక్రాంతి వేడుకలను ప్రారంభించారు. అంతరించిపోతున్న సంప్రదాయాలను, సంస్కృతిని భావితరాలకు తెలియజేయాలన్నారు. కన్వీనర్ పాలడుగు నాగసాయి, మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంపీ రామోజీరావు, ఏవో వై.మధుసూదనరావు పాల్గొన్నారు.



భోగి మంటలు వెలిగిస్తున్న చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ నాగేశ్వరరావు

ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో..



ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

పెనమలూరు : విజయవాడ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. సంబరాల్లో భాగంగా పాఠశాల్లో గడ్డితో వేసిన గుడిసెలతో, సంప్రదాయ వస్తువుల ప్రదర్శనతో, వివిధ రకాల బొమ్మల కొలువులతో, రంగవల్లులతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకొంది. విద్యార్థులు గోదాదేవి కళా రూపకాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. ఛైర్మన్ పరిమి నరేంద్ర బాబు, డైరెక్టర్లు పవన్ చంద్, కడియాల ప్రవీణ్, అకడమిక్ డైరెక్టర్ డేవిడ్‌రాజు, ప్రిన్సిపాల్ భువనేశ్వరన్, వైస్ ప్రిన్సిపాల్ సంజయ్ భాటియా పాల్గొన్నారు.

●కానూరులోని పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలను వైభవంగా నిర్వహించారు. సిద్ధార్థ అకాడమీ స్వర్ణోత్సవాల సందర్భంగా ఫ్రెష్‌మ్యాన్ ఇంజనీరింగ్ డిపార్టుమెంటు నిర్వహించిన ఈ వేడుకలు మన గొప్ప సంస్కృతి సంప్రదాయాలను గుర్తుచేశాయి. ముఖ్య అతిథిగా హాజరైన శారద విద్యాసంస్థల ఎండీ శారదాదేవి సంక్రాతి విశిష్టతను వివరించారు.



పశువుల షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పశు పోషణాభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి

కంకిపాడు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పశు పోషణాభివృద్ధిపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విశేషంగా కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కంకిపాడులో రూ. 2.30 లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించిన పశువుల షెడ్డును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ మాట్లాడుతూ నేడు పశు పోషణపై రైతుల్లో ఆసక్తి తగ్గిపోయిందన్నారు. రైతులు వ్యవసాయంతో పాటు పశుపోషణపై దృష్టి పెట్టాలని కోరారు. పశుపోషకులకు అవసరమైన షెడ్ల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత తుమ్మలపల్లి హరికృష్ణ, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజ, చలవాది రాజ, వంగూరు పవన్, జనసేన పార్టీ నాయకులు బోయిన నాగరాజు, ముప్పా చంద్రశేఖర్, పచ్చిపాల శేఖర్, కుంటా గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు : పాడి రైతుల సంక్షేమం కోసం మినీ గోకులం పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందని జిల్లా డ్వామా పీడీ ఎన్వి శివప్రసాద్ అన్నారు. గండిగుంటలో మినీ గోకులం షెడ్డును శుక్రవారం ప్రారంభించారు.



ఆరోగ్య రథం వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

ఏపీఎండీసీ సేవలు అందుబాటులోకి తెస్తాం

● ఆరోగ్య రథాల ప్రారంభ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర

పెనమలూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ స్కీమ్ కింద ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ(ఏపీఎండీసీ) సేవల్ని రాష్ట్రవ్యాప్తంగా త్వరలోనే అందుబాటులోకి తెస్తామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శుక్రవారం తాడిగడప వందడుగుల రోడ్డులోని ఏపీఎండీసీ కార్యాలయంలో ఆరోగ్య రథం వాహనాలను ఎండీ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. మైనింగ్ అధికంగా జరిగే పాడేరు, అరకు ప్రాంతాల్లోని ప్రజలకు ఈ వాహనాల ద్వారా వైద్య సేవలందిస్తారన్నారు. 2017లో ఏపీఎండీసీ ఆధ్వర్యంలో రూ.17కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని, వైసీపీ ప్రభుత్వ పాలకులు ఆ పథకాలను, కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ పథకాన్ని నాశనం చేశారని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని ఖనిజవనరులను దోచుకోవడంపై పెట్టిన శ్రద్ధ ప్రజల ఆరోగ్యంపై వైసీపీ పాలకులు చూపలేదని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికే ఏపీఎండీసీ ద్వారా ఆరోగ్యసేవలు, విద్యాలయాలు, ఇతర వైద్య సేవలు అందిస్తున్నామని, ఇప్పుడు రూ.కోటి వ్యయంతో పూర్తి సాంకేతికత కలిగిన వాహనాలను అందుబాటులోకి తెస్తున్నామని పేర్కొన్నారు.



గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

క్యాలెండర్ ఆవిష్కరణ

వన్‌టౌన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం క్యాలెండర్‌ను శుక్రవారం రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆవిష్కరించారు. శుక్రవారం పుట్టిన రోజు సందర్భంగా మంత్రిని, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, మరికొందరు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు రాటకొండ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యుడు ఏజెర్ల ప్రభాకర్, ఎన్టీఆర్ జిల్లా డివిజన్ అధ్యక్షుడు ఎండీ సయ్యద్ బాజీ పాల్గొన్నారు.



రాష్ట్రంలో అంబేడ్కర్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలంటూ ధర్నాచౌక్‌లో ధర్నా చేస్తున్న యూనివర్సిటీ పార్ట్‌టైమ్ ఉద్యోగులు

అంబేడ్కర్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

ధర్నాచౌక్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని, 2024-25 అడ్మిషన్ నోటిఫికేషన్ ఇవ్వాలని బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఆంధ్రప్రదేశ్ పార్ట్‌టైమ్ స్టాఫ్, కౌన్సిలర్స్ అండ్ స్టూడెంట్స్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నాచౌక్‌లో రెండు రోజుల ధర్నాను శుక్రవారం వారు ప్రారంభించారు. 2024-25 అడ్మిషన్లు నిలిపివేస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. యూనివర్సిటీలో అడ్మిషన్లు తీసుకుని ఇంకా కోర్సు పూర్తిచేయని రెండు లక్షల మంది రాష్ట్రానికి చెందిన వారున్నారన్నారు. ప్రతీ ఏడాది యూనివర్సిటీలో అధికశాతం ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు అడ్మిషన్లు తీసుకుంటున్నారన్నారు. రాష్ట్రంలోని అధ్యయన కేంద్రాల్లో అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులు చెల్లించే రూ.21 కోట్లకు పైగా ఫీజులను తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. తక్కువ మొత్తంలో ప్రభుత్వం నిధులు కేటాయించినా రాష్ట్రంలో విశ్వవిద్యాలయం నిర్వహించవచ్చని వారు పేర్కొన్నారు. కె.ఈరన్న, ఎస్.రామచంద్రరావు, కె.జ్యోతి, అమరనాథ్, బి.ఆదినారాయణ పాల్గొన్నారు.

మునిసిపాలిటీలకు సకాలంలో పన్నులు చెల్లించండి



మాట్లాడుతున్న రాజమండ్రి ఆర్డీ నాగ నరసింహారావు

పెడన, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రజలు మునిసిపాలిటీలకు సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాల అభివృద్ధికి సహకరించాలని పుర పరిపాలన శాఖ రాజమండ్రి రీజియన్ డైరెక్టర్ సీహెచ్ నాగ నరసింహారావు కోరారు. శుక్రవారం కృష్ణా జిల్లా పురపాలక సంఘాల సమీక్షా సమావేశంలో పాల్గొనేందుకు పెడన మునిసిపాలిటీకి విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడారు. మునిసిపాలిటీల్లో పారిశుధ్య పరిస్థితి మెరుగుపడటానికి ప్రజల సహకారం అవసరమన్నారు. ప్రజలు ఎక్కడబడితే అక్కడ చెత్త వేయకుండా మునిసిపల్ వాహనాల్లోనే వేయాలని సూచించారు. పన్నుల వసూళ్లలో గుడివాడ మునిసిపాలిటీ ముందంజలో ఉందన్నారు. మునిసిపాలిటీలు పన్నుల వసూళ్లలో పురోగతి సాధిస్తేనే శానిటేషన్, తాగునీటి వంటి సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. విలేకరుల సమావేశం అనంతరం కౌన్సిల్ సమావేశపు హాలులో పెడన, మచిలీపట్నం, గుడివాడ, తాడిగడప, ఉయ్యూరు మునిసిపల్ కమిషనర్లు, సిబ్బందితో మునిసిపల్ పాలన అంశాలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. పెడన కమిషనర్ ఎం.గోపాలరావు, మచిలీపట్నం కమిషనర్ సీహెచ్ బాపిరాజు, ఉయ్యూరు కమిషనర్ వెంకటేశ్వరరావు, గుడివాడ కమిషనర్ శ్రీనివాసరావు, తాడిగడప కమిషనర్ భవానీప్రసాద్ పాల్గొన్నారు.

కోర్టుకు బుద్దా వెంకన్న, టీడీపీ నాయకులు


● వైసీపీ హయాంలో ధర్నాలు చేసిన కేసుల్లో హాజరు



సివిల్ కోర్టుకు హాజరైన టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న, మాజీ కార్పొరేటర్లు, నాయకులు

వన్‌టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ప్రజా వ్యతిరేక విధానాలపై ఒకే రోజు నాలుగు ధర్నాలు చేసినందుకు పోలీసులు నమోదు చేసిన కేసుల్లో శుక్రవారం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్నతో పాటు పలువురు మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు విజయవాడ సివిల్ కోర్టుకు హాజరయ్యారు. కోర్టు ఈనెల 21కు వాయిదా వేసింది. బుద్దా వెంకన్నతో పాటు మాజీ కార్పొరేటర్లు బొబ్బూరి నారాయణస్వామి, పత్తి నాగేశ్వరరావు, యేదుపాటి రామయ్య, హబీబుల్లా, డివిజన్ అధ్యక్షుడు చిన్నసుబ్బయ్య, సురభి బాలు, నారాయణ, మాల్యాద్రి, గంగవరపు సురేష్, శ్రీకాంత్ ఉన్నారు.

బరి తెగింపు!



తాతకుంట్లలో క్యాసినో తరహాలో ఏర్పాట్లు

- మామిడి తోటల్లో చకచకా ఏర్పాట్లు
- క్యాసినోను తలపిస్తూ బరుల చుట్టూ ఫెన్సింగ్
- వీక్షకుల కోసం ప్రత్యేక గ్యాలరీలు
- లక్షల్లో చేతులు మారుతున్న నగదు
- విజేతలకు బుల్లెట్ ఆఫర్లు!
- కూటమి, వైసీపీ నేతల మిలాఖత్
- నిస్సహాయస్థితిలో రెవెన్యూ, పోలీసులు

సంక్రాంతి జోష్ మొదలైంది. కోడిపందేల బరులకు నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేసేస్తున్నారు. హైకోర్టు నిబంధనలు ఉన్నా.. పోలీసు అధికారులు హెచ్చరికలు చేస్తున్నా.. లెక్కచేయక కోడి పందేల కోసం భారీ బరులను చకచకా సిద్ధం చేస్తున్నారు. క్యాసినోను తలపించేలా ఏర్పాట్లు జరిగిపోతున్నాయి. పలుచోట్ల కూటమి, వైసీపీ నేతలు కలిసికట్టుగా బరులను సిద్ధం చేయడం గమనార్హం.

తిరువూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు, విస్సన్నపేట మండలాల్లో పందేలకు మామిడితోటల్లో భారీగా బరులను సిద్ధం చేస్తున్నారు. సత్తుపల్లి రోడ్డులో కోడిపందేలు జరిగే ప్రాంతం మొత్తం ఫెన్సింగ్‌తో పాటు, ఐరన్‌రాడ్లతో క్యాసినో తరహాలో బారికేడ్లు నిర్మిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు, పందెం రాయుళ్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, బరిచుట్టూ ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నారు. నాలుగుమండలాల్లోని మామిడితోటల్లో, భారీ పందేలు వేసేందుకు ప్రత్యేక బరులతో పాటుగా, చిన్నచిన్న పందేలకు అనువుగా కొన్ని బరులు ఏర్పాటు చేస్తున్నారు. బరివద్ద ముసుగుపందేల్లో విజేతలకు బుల్లెట్ బైక్ బహుమతిగా ఇచ్చేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. బరుల సమీపంలో కోసు, గుండాట వంటి జూదాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. నిర్వాహకులకు పందేల కంటే కోసువల్లే అత్యధిక లాభాలు చేకూరుతాయి. ఇప్పటికే కోడిపందేల నిర్వాహకులతో సంబంధిత వ్యక్తులు బేరాలు కుదుర్చుకున్నట్టు సమాచారం. దూరప్రాంతాలకు చెందిన జూదగాళ్లు పండగ మూడురోజులు, పట్టణంలోనే ఉంటూ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే కొందరు కోడిపందేల నిర్వాహకులకు కోసు నిర్వాహకులు లక్షల్లో ముట్టజెప్పినట్టు తెలుస్తోంది. కోడిపందేల పేరుతో పలుచోట్ల అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు కలిసి మరీ ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది. పట్టణ పరిధిలో ఏర్పాటు చేస్తున్న బరుల్లో ఒకటి టీడీపీ, వైసీపీ నేతలు నిర్వహిస్తుండగా, మరో బరిని జనసేన, టీడీపీ నేతలు నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. రాష్ట్ర సరిహద్దుప్రాంతాల్లో తోటల్లో తెలంగాణ మద్యం విక్రయాలు చేసేందుకు ఇప్పటికే భారీగా మద్యం దిగుమతి చేసుకున్నట్టు ఆరోపణలున్నాయి. కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముందస్తు హెచ్చరికలు చేసిన రెవెన్యూ, పోలీసు అధికారులు సమయం దగ్గరపడుతుండగా మిన్నకుండిపోయారు.



కోసూరులో సిద్ధం చేస్తున్న బరి

ముమ్మర ఏర్పాట్లు

కూచిపూడి: కోసూరు, పెదపూడి, కూచిపూడి గ్రామాల్లో బరుల కోసం నిర్వాహకులు పొలాలను చదును చేసి స్తంభాలు పాతి ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారు. మూడు రోజులపాటు రాత్రివేళల్లోనూ, ఫ్లడ్‌లైట్ల వెలుతురులో కోడి పందేలు, జూద క్రీడలు నిర్వహించుకునేలా జనరేటర్లు ఏర్పాటు చేస్తున్నారు. పందేలు వీక్షించేందుకు స్టేజీలు ఏర్పాటు చేస్తున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం కూచిపూడిలో లాడ్జిలన్నీ బుక్ అయ్యాయి. బరుల వద్ద స్టాల్స్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఎక్కువ పందేలు గెలిచిన వారికి ఆకర్షణీయమైన ఖరీదైన బహుమతులు అందిస్తామని నిర్వాహకులు ప్రచారం చేస్తున్నారు. కూటమి నేతలు, వైసీపీ నేతలు సంయుక్తంగా బరులు ఏర్పాటు చేయడం విశేషం. కూచిపూడి పోలీస్ స్టేషన్‌కు సమీపంలో బరులు ఏర్పాటు చేస్తున్నా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు.



పెదపూడిలో బరి చుట్టూ పరదాలు కడుతున్న కూలీలు



సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో ధర్నా చేస్తున్న మునిసిపల్ కార్మికులు

సమస్యలు పరిష్కరించాలి

ధర్నాచౌక్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె సందర్భంగా ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల జీవోలను వెంటనే విడుదల చేయాలని మున్సిపల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, యూనియన్ నగర గౌరవాధ్యక్షుడు దోనేపూడి కాశీనాథ్ డిమాండ్ చేశారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) నగర కమిటీ ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో శుక్రవారం నిరసన దీక్ష చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని లేదంటే రాబోయే రోజుల్లో భారీగా ఉద్యమించేందుకు కార్మికులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. కార్మికుల మధ్య చిచ్చుపెట్టి నామమాత్రపు జీతాలు చెల్లించి వారితో వెట్టిచాకిరి చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. యూనియన్ నగర అధ్యక్షుడు ఎస్.జ్యోతిబసు, ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.ప్రవీణ్, కోశాధికారి వెంకటేశ్వరరావు, కార్మికులు పాల్గొన్నారు.

ముగిసిన అ'ధర్మసింగ్' కస్టడీ

విజయవాడ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలం మాజీ సబ్‌రిజిస్ట్రార్ ఎల్.ధర్మసింగ్ ఏసీబీ కస్టడీ శుక్రవారంతో ముగిసింది. మూడు రోజుల క్రితం ఏసీబీ సీఐయూ అధికారులు అతడిని కస్టడీకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ విచారణలో అధికారులు సింగ్ నుంచి కీలక విషయాలు రాబట్టినట్టు సమాచారం. ఇప్పటికే సింగ్ ఆస్తులు రూ.10 కోట్లు దాటి ఉంటాయని ఏసీబీ అధికారులు లెక్కించారు. విచారణలో సింగ్ వాంగ్మూలాన్ని నమోదు చేశారు. దానిని బట్టి అధికారులు తదుపరి దర్యాప్తు చేస్తారని తెలిసింది.



చిన్నేటి ఒడ్డున శ్మశానభూమికి ఫెన్సింగ్



ఆక్రమణలతో కుచించుకుపోయిన చిన్నేరు కాల్వ

శ్మశానభూమి కబ్జా

● చిన్నేటి ఒడ్డున 50 సెంట్ల చుట్టూ ఫెన్సింగ్.. బ్రిడ్జికి మరోవైపున పశువుల పాక

● గత ఏడాది వరదల్లో జగ్గయ్యపేట మునకకు ఆక్రమణలే కారణం

(ఆంధ్రజ్యోతి-జగ్గయ్యపేట)

పట్టణంలోని హిందూ శ్మశాన వాటికకు వెళ్లే రహదారిలో చిన్నేటి సమీపంలో శ్మశానభూమి కబ్జాకు కొందరు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే రుద్రభూమికి వెళ్లే మార్గం కుచించుకుపోయింది. చిన్నేటిపై ఉన్న బ్రిడ్జి గత ఏడాది ఆగస్టులో వచ్చిన వరదలకు దెబ్బతింది. ఆ సమయంలో చిన్నేటి కాల్వలో ఉన్న ఆక్రమణలు, పిచ్చిచెట్లు, చెత్తా చెదారం కొట్టుకుపోయింది. దీంతో చిన్నేరు పూర్తిస్వరూపం బయటపడింది. చిన్నేరు, పెద్దేరుల మధ్య హిందూ శ్మశాన వాటిక విస్తరించి ఉంది. వరదల్లో చెత్తా చెదారం, పిచ్చిచెట్లు కొట్టుకుపోగా ఏటి ఒడ్డు బయటపడింది. ఆ ఒడ్డుపై అక్రమార్కుల కన్ను పడింది.



బ్రిడ్జికి మరో వైపు పశువుల పాక వేసి కబ్జా

కొద్దిరోజులుగా ఆ స్థలాన్ని బాగు చేయించి చుట్టూ 50 సెంట్ల వరకు ఆక్రమించి సొంత భూమిలా ఫెన్సింగ్ వేస్తున్నారు. చిన్నేటి బ్రిడ్జికి మరో వైపు పశువుల పాక వేసి గేదెలు కట్టేస్తున్నారు. మరికొంత స్థలాన్ని చదును చేసి కబ్జాకు సిద్ధం చేస్తున్నారు. హిందు శ్మశానవాటికకు ఉన్న స్థలం సరిపోక పలు కులాల వారు తమకు శ్మశాన వాటిక కావాలని కోరుతుంటే ఉన్న స్థలం ఇలా ఆక్రమణకు గురికావటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు

గుణపాఠం నేర్చుకోరా..

గత ఏడాది వచ్చిన వరదలకు చిన్నేరు, పెద్దేరు కలిసిపోయి ప్రవహించాయి. పట్టణంలోని పెద్ద శివాలయం వరకు వరద ముంచెత్తింది. నాగమయ్యవీధి, రజక బజార్, మిట్టగూడెం, బలుసుపాడు రోడ్డు వరకు నీరు ఎగతన్నింది. దీంతో బలుసుపాడు రోడ్డులోని బీసీల శ్మశాన వాటిక ధ్వంసమైంది. ముస్లింల ఈద్‌గా గోడ కూలిపోయింది. చిన్నేరు, పెద్దేరు పరివాహక ప్రాంతాలు ఆక్రమణకు గురి కావడమే దీనికి కారణం యానాదుల కాలనీలో గుడిసెలు మునిగిపోయాయి. వరద వల్ల నష్టం జరిగినా గుణపాఠం నేర్చుకోకపోగా చిన్నేటి కాల్వను పూడ్చి ఆక్రమణలకు పాల్పడడం ఏంటని పట్టణవాసులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. తక్షణం అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని కబ్జాను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కబ్జా నా దృష్టికి రాలేదు

ఇప్పటి వరకు శ్మశానవాటిక భూమి కబ్జా వ్యవహారం నా దృష్టికి రాలేదు. విచారణ జరుపుతాం. ఆక్రమణదారుపై చర్యలు తీసుకుంటాం.

- మనోహర్, తహసీల్దార్

అమరావతిలో క్రీడా నగరం

● అంతర్జాతీయ సదుపాయాలతో నిర్మాణం: ఎంపీ కేశినేని చిన్ని



అండర్-19 బాలికల జాతీయ వాలీబాల్ టోర్నమెంట్ విజేత తమిళనాడు జట్టుకు కప్ అందిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని

వన్‌టౌన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు సీఎం చంద్రబాబునాయుడు విశేష కృషి చేస్తున్నారని, రాజధాని అమరావతి ప్రాంతంలో అంతర్జాతీయ మౌలిక సదుపాయాలతో క్రీడా నగరం నిర్మించబోతున్నారని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) తెలిపారు. మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ జూనియర్ కాలేజీలో 68వ స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్-19 జాతీయ వాలీబాల్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ శుక్రవారం జరిగింది. కర్ణాటకపై తమిళనాడు జట్టు విజయం సాధించింది. బహుమతుల ప్రదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ విచ్చేశారు. ఈనెల 26వ తేదీ తరువాత నగరంలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం క్రీడాకారులకు అందుబాటులోకి వస్తుందని ఆయన తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారన్నారు. ముఖ్యమంత్రి స్ఫూర్తితో ఎన్టీఆర్ జిల్లాలోని నూతన 147 ప్రభుత్వ స్కూల్ గ్రౌండ్స్‌ను తన సొంత నిధులతో ఆధునీకరించినట్లు తెలిపారు. ఈనెల 23వ తేదీన మంత్రి నారా లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా ఎన్టీఆర్ జిల్లాలోని 147 ప్రభుత్వ పాఠశాలలకు ఎనిమిది రకాల క్రీడా వస్తువులు పంపిణీ చేస్తామన్నారు. నిర్వాహకులు ఎంపీని సత్కరించారు. ద్రోణాచార్య అర్జున అవార్డు గ్రహీత అరికపూడి రమణరావు, స్టేట్ స్కూల్ గేమ్స్ సెక్రటరీ జి.భానుమూర్తిరాజు, శాప్ మాజీ చైర్మన్ అంకం చౌదరి, పి.బి.సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, డీఐఈవో సి.ఎస్ఎస్.ఎన్. రెడ్డి, ప్రీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్- 19 జిల్లా సెక్రటరీ వి.రవికాంత్, వాలీబాల్ సంఘం జిల్లా కార్యదర్శి దోనేపూడి దయాకర్‌రావు పాల్గొన్నారు.

పంట నష్టం అక్రమాలపై విచారణ ప్రారంభం



తోట్లవల్లూరులో విచారణ అధికారులతో మాట్లాడుతున్న రైతు సూరంశెట్టి సత్యనారాయణ

తోట్లవల్లూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది వరదతో దెబ్బతిన్న పంటల నష్టపరిహారం అక్రమాలపై శుక్రవారం విచారణ ప్రారంభమైంది. ఎరువులు, పురుగు మందుల వ్యాపారులకు, బోగస్ రైతులకు అక్రమ పద్ధతిలో నష్టపరిహారం ఇవ్వడంపై ఆంధ్రజ్యోతిలో పలు కథనాలు వచ్చాయి. దీంతో జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ విచారణ అధికారులను నియమించారు. అగ్రికల్చర్ పంటలపై అగ్రికల్చర్ డీడీ ఎస్.మనోహర్, ఏడీ ఎన్.మణిధర్‌ను, ఉద్యాన పంటలపై జిల్లా ఉద్యానాధికారిణి జ్యోతిని నియమించారు. మనోహర్, మణిధర్, తోట్లవల్లూరు వ్యవసాయ కార్యాలయంలో అధికారులను రైతు సూరంశెట్టి సత్యనారాయణ కలిసి తాను అరెకరం చెరకు కౌలుకు సాగుచేసి వరదకు నష్టపోయానని, కౌలురైతు గుర్తింపు ఉందని, అగ్రికల్చర్ అసిస్టెంట్ మౌనికను పదిసార్లు కలిసి వివరాలు సమర్పించి వేలిముద్ర వేసినా పరిహారం రాలేదని తెలిపారు. దీంతో అధికారులు మౌనికను పిలిచి, రైతుముందే ప్రశ్నించారు. గడువు దాటిపోయాక వచ్చాడని మౌనిక అనడంతో రైతు అది నిజం కాదని, తనకంటే వెనుక వచ్చిన రైతులకు పరిహారం వచ్చిందని చెప్పారు. దీంతో రైతు వివరాలను అధికారులు నమోదు చేసుకున్నారు. ఏవో నాగేశ్వరరావు నుంచి వివరాలు తెలుసుకున్నారు. గ్రామ సచివాలయాల సిబ్బందిని గండిగుంట పిలిపించుకుని ఉద్యాన పంటల అక్రమాలపై విచారణను జిల్లా ఉద్యానాధికారి జ్యోతి విచారణ చేశారు. ఈ సమాచారం ఆధారంగా తోట్లవల్లూరు వచ్చి విచారణ చేస్తానని తెలిపారు. విచారణ కొన్ని రోజులపాటు కొనసాగుతుందని అధికారులు తెలిపారు.



కంకిపాడులో పూటీ లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న జనసేన రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు, బండి రామకృష్ణ, ముప్పా రాజా తదితరులు

పూటీ లాగుడు పోటీలు ప్రారంభం

కంకిపాడు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా ఆధ్వర్యంలో కంకిపాడులో శుక్రవారం ఎడ్ల ప్రదర్శన, పూటీ లాగుడు పోటీలను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు ప్రారంభించారు. పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఆయన అన్నారు. సంప్రదాయ ఎడ్ల ప్రదర్శనకు మంచి స్పందన వస్తోందని జనసేన మచిలీపట్నం నియోజకవర్గ సమన్వయకర్త బండి రామకృష్ణ అన్నారు. వివిధ జిల్లాల నుంచి 23 ఎడ్ల జతలు పోటీల్లో పాల్గొన్నాయని ముప్పా రాజా తెలిపారు.

సీనియర్ రెసిడెంట్స్ నియామకానికి 17న ఇంటర్వ్యూలు

ప్రభుత్వాసుపత్రి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రభుత్వ దంత కళాశాల, వైద్యశాలలోని పలు విభాగాల్లో ఖాళీగా ఉన్న సీనియర్ రెసిడెంట్స్ నియామకాలకు ఈనెల 17వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు హెచ్ఎం కొలసాని శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. వివరాలకోసం హెచ్‌టీటీపీ://జీడీసీహెచ్‌వీజేఏ.ఇన్ వెబ్‌సైట్‌ను చూడాలన్నారు.



చాదర్‌ను సమర్పిస్తున్న సీపీ ఎస్వీ రాజశేఖర్‌బాబు

చాదర్ సమర్పణ

ఇబ్రహీంపట్నం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కొండపల్లిలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం హజరత్ సయ్యద్ షాబుఖారి బాబా దర్గా 428వ ఉరుసు మహోత్సవాల్లో రెండో రోజు శుక్రవారం బాబాకు విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు ప్రత్యేక చాదర్‌ను సమర్పించి ప్రార్థనలు చేశారు. ఉరుసు నిర్వహణ కమిటీ చైర్మన్ అల్తాఫ్ బాబా ముస్లిం మతాచారం ప్రకారం సీపీకి స్వాగతం పలికారు. భక్తులకు సీపీ భోజనం వడ్డించారు. ఏడీసీపీ రామకృష్ణ, వెస్ట్‌జోన్ ఏసీపీ దుర్గారావు, ఇబ్రహీంపట్నం సీఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మట్టి తవ్వుతున్న యంత్రం స్వాధీనం

వన్‌టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పాతపాడు, నున్న మధ్య పోలవరం కాలువ మట్టిని అనధికారికంగా తరలిస్తున్న వారిపై ఇరిగేషన్ అధికారులు గురువారం రాత్రి దాడి చేశారు. మట్టి తవ్వుతున్న ప్రొక్లెయిన్‌ను స్వాధీనం చేసుకుని నున్న పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. మట్టి తవ్వుతున్న వారు అక్కడ నుంచి పరారయ్యారు. పాతపాడు, కండ్రిక ప్రాంతానికి చెందిన కొందరు పాతపాడు, నున్న మధ్య పోలవరం కాలువ మట్టిని రాత్రివేళలో తరలిస్తున్నారని ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రచురితమవడంతో పోలీసు, ఇరిగేషన్ ఉన్నతాధికారులు స్పందించారు. మూడు రోజుల నుంచి ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణ కొత్తూరు తాడేపల్లి, పాతపాడులో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు.

అమరావతిలో స్టడీ సర్కిల్ నిర్మాణంతో బీసీలకు మేలు

● బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు పీవీఎల్ఎన్ రాజు

ధర్నాచౌక్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ఐదు ఎకరాల్లో స్టడీ సర్కిల్ నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం మంచి పరిణామమని బీసీ ఐక్య వేదిక నగర అధ్యక్షుడు పీవీఎల్ఎన్ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని బీసీ విద్యార్థులకు ఈ స్టడీ సర్కిల్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు ఓబన్న జయంతి వేడుకలు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా నిర్వహిస్తున్నందుకు ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	112, 120, 131
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

బొమ్ములూరులో టెంట్లు తొలగింపు


బొమ్ములూరులో టెంట్లు తొలగిస్తున్న తహసీల్దార్, ఎస్ఐ

గుడివాడ రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గుడివాడ మండలంలో పేకాట, కోడిపందాలు ఆడితే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రామకోటేశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం బొమ్ములూరు గ్రామంలో కోడిపందాల కోసం టెంట్లు వేయగా, ఎస్ఐ చంటిబాబుతో కలసి పోలీసు, రెవెన్యూ సిబ్బంది తొలగించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఏలాంటి పేకాట, కోడిపందాలు నిర్వహించటాకి వీల్లేదన్నారు. తమ దృష్టికి తీసుకువస్తే వాటిని తొలగిస్తామన్నారు. ఎస్ఐ చంటిబాబు మాట్లాడుతూ బిళ్లపాడులో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.2400 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ, జనవరి 10(ఆంధ్రజ్యోతి) : గుడివాడ, పెద ఎరుకపాడు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శనివారం ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ జి.బి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గృహ, వ్యవసాయ, పరిశ్రమలు, వాణిజ్య వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పెదపారుపూడి: విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పెదపారుపూడి మండల పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

కూచిపూడి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ఎన్‌డీఏ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అయ్యంకి, పెడసనగల్లు గ్రామాల్లో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యంకిలో సీసీ రహదారుల శంకుస్థాపన, సామూహిక రక్షిత మంచినీటి పథకంపై అవగాహన సదస్సు జరిగింది. అనంతరం పెడసనగల్లు గ్రామంలో జరిగిన మినీ గోకులం షెడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో జడ్పీ సీఈవో కన్నమనాయుడు, ఎంపీపీ కొండేటి ఇందిర, పార్టీ నేతలు నన్నపనేని వీరేంద్ర, లింగమనేని రామలింగేశ్వరరావు, జడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతీ, జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధ రాజు, గ్రామసర్పంచ్ నాగనబోయిన సునీల్, ఎండీవో జె.విమాదేవి, ఈవోపీఆర్డీ పరమాత్మ, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


గుడివాడలో..


పామర్రులో..


మంటాడలో..


తోట్లవల్లూరులో..


కపిలేశ్వరపురంలో..

వైభవంగా ఉత్తర ద్వార దర్శనం

గుడివాడ, జనవరి 10(ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుండి వేలాదిగా భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. నాలుగ గంటలకు ఉత్తర ద్వార దర్శనను ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ చలసాని ఇందిరా రమణరావు ప్రారంభించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు ఏర్పాట్లు చేశారు. పామర్రు: స్థానిక పట్టణంలో ఉన్న శ్రీవైష్ణవాలయంతో పాటు మండలంలో పలు వైష్ణవాలయాల్లో శుక్రవారం ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే పామర్రు వైష్ణవాలయంలో ప్రధాన అర్చకులు భార్గవ ముకుందచార్యులు, ఆర్‌వీఎస్‌వి ప్రసాద్ ఆధ్వర్యంలో స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో కూర్చోబెట్టి ఉత్తర ద్వార దర్శనం భాగ్యం భక్తులకు కల్పించారు. అనంతరం ఉత్సవ మూర్తులను గ్రామ పురవీధుల్లో ఊరేంగించారు. ముక్కోటి విశిష్టతను గ్రామాల్లో వివరించారు. ప్రముఖ వైద్యురాలు ఆర్.విశాలక్ష్మి, ఉపసర్పంచ్ దేవిరెడ్డి బాల వేంకటేశ్వరరెడ్డి, పంచాయతీమాజీ సభ్యులు తాడిశెట్టి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.పలువైష్ణవ ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనాలు కల్పించారు.

పామర్రు పరిధిలోని రాపర్లలో వేంచేసిన యున్న గణ్యశ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిది భక్తులతో పోటేత్తింది. స్వామివార్లను ఉత్తర ద్వార దర్శనం చేసుకోనేందుకు చుట్ట పక్క ప్రాంతాలనుంచి భక్తులు విశేష సంఖ్యలో హాజరై పూజాదికాలు జరిపించికును తీర్థప్రసాదాలు అందుకున్నారు. పేరిశేపల్లి, నిమ్మకూరు గ్రామాల్లో గల వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో జరిగిన ప్రత్యేక పూజల్లో భక్తులు స్వామివార్ల దర్శనాలు చేసుకున్నారు

కూచిపూడి: ముక్కోటి ఏకాదశి వేడుకలతోపాటు ఉత్తర ద్వార దర్శనాలు పలు గ్రామాల్లోని ఆలయాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా విశేష పూజలు, గ్రామ పురవీధుల్లో స్వామి ఊరేగింపు కార్యక్రమాలు జరిగాయి. పెదముత్తేవి శ్రీ కృష్ణాశ్రమంతో పాటు చినముత్తేవి, కోసూరు, నిడుమోలు, భట్లపెనుమర్రు, పెడసనగల్లు, కాజ, వేములమడ గ్రామాల్లో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి.

పమిడిముక్కల : మంటాడ శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వైకుంఠ వెంకటేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శుక్రవారం ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. వేకువ జాము నుంచి పమిడిముక్కల మండలంతో పాటు జిల్లాలో పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి క్యూల్లో నిలబడి ఉత్తర ద్వారా దర్శనం ద్వారా స్వామివారి దర్శనం చేసుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారి మాధవీలత ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పెదపారుపూడి: పెదపారుపూడిలో ఉన్న సీతారాముల దేవస్థానంలో స్వామి ప్రత్యేక అలంకరణలో ఉత్తర ద్వారం ద్వారా భక్తులకి దర్శనం ఇచ్చారు. ఆలయ అర్చకులు లక్ష్మీనరసింహాచార్యులు స్వామికి ప్రత్యేక పూజలు చేసి ముక్కోటి ఏకాదశి గురించి వివరించారు.

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున 5 గంటలకే భక్తులు భారీగా ఆలయానికి చేరుకుని క్యూలో నిలబడి ఉత్తరద్వారంలో స్వామిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరులో ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో గరుడ వాహనంపై స్వామి వార్లను ఉత్తర ద్వార దర్శనం భక్తులు దర్శనమిచ్చారు. శ్రీరమా సహిత శ్రీసత్యనారాయణస్వామి వారా ఆలయంలో, కౌతవరంలోని శ్రీచెన్నకేశవ స్వామి ఆలయంలో స్వామి వార్లను భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు.

పమిడిముక్కల: కపిలేశ్వపురం గీతా మందిర్‌లో వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని శుక్రవారం లక్షఒత్తుల దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. 150మంది మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. అర్చకుడు వేదాంతం రాము దీపోత్సవం శాస్త్రోక్తంగా చేయించారు. కపిలేశ్వరపురం, పరిసర గ్రామాల ప్రజలు తరలివచ్చి దీపోత్సవం తిలకించారు. 20 సంవత్సరాలుగా దీపోత్సవం కొనసాగిస్తున్నట్టు మందిర్ నిర్వాహకురాలు నిమ్మగడ్డ పద్మ తెలిపారు. మందిర్ ట్రస్టీ మూల్పూరి గోవింద ప్రభాకరరావు, తుమ్మల గంగాధరరావు పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన చేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు చెరుకూరి మల్లిఖార్జునరావు, చిగురుపాటి శ్రీకృష్ణ సేవలందించారు.


ధర్నా నిర్వహిస్తున్న గ్రామస్తులు

మా ఊరు పేరు చెప్పండి .. గ్రామస్థుల ధర్నా

గుడ్లవల్లేరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరు గ్రామంలోని మామిడికోళ్ల రోడ్డులోని ప్రజలు ఏ ఊరులో ఉన్నామో చెప్పాలంటూ శుక్రవారం ధర్నా నిర్వహించారు. కనీసం తమ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలను వేయాలని కోరారు. గుడ్లవల్లేరు పంచాయతీలో అడిగితే కౌతవరం పంచాయతీలో అడగమని. రెండు పంచాయతీలు అటు ఇటు తిప్పుతున్నారని, తాము అసలు ఏ గ్రామానికి చెందినవాళ్లమో తెలియడం లేదని, తాము అసలు ఏ గ్రామానికి చెందిన వారమో తెలపాలని కోరారు. ఈ ధర్నాలో నిడుమోలు పెద్దిరాజు, నీలం జ్యోతి, కె.వరలక్ష్మీ, శ్యామల, పుష్పవతి, సలీం, రెహమాన్, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, హనుమంతరావు, పాల్గొన్నారు.


పారిశుధ్య కార్మికులకు యూనిఫామ్ అందజేసిన నేతలు

పారిశుధ్య కార్మికులకు యూనిఫామ్ పంపిణీ

గుడివాడ రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గుడివాడ కాళహస్తి కాలనీకి చెందిన టీడీపీ నాయకులు డి.నాగ రవి మల్లాయిపాలెం గ్రామ పంచాయతీ సిబ్బందికి యూనిఫామ్ పంపిణీ చేశారు. ప్రత్యేకాధికారి బి.వై.విష్ణు ప్రసాద్, మల్లాయిపాలెం నాయకులు సమ్మెట బ్రహ్మజీ, యు.మురళీ, పిచ్చియ్య, జోగి సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శి కోటయ్య, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పామర్రు నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

పామర్రు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పామర్రు నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటునందించి సమస్యల పరిష్కారం కోసం సహకరించాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా కలెక్టర్ డీకే బాలాజీని కోరారు. శుక్రవారం మచిలీపట్నం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా పామర్రు పట్టణంలో పేదలకు ఇళ్ల స్థలాలు సత్వరమే అందేలా చర్యలు తీసుకోవాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు తీసుకోవాల్సిన అంశాలు, గ్రామీణ ప్రాంత ప్రజలకు తాగునీటి సరాఫరాకు అవసరమైన ప్రణాళికలపై చర్చలు జరిగినట్లు ఎమ్మెల్యే తెలిపారు. పమిడిముక్కల మండలంలో సాగవుతున్న పామాయిల్‌పై రైతుల్లో మరింత చైతన్యం తీసుకువచ్చేలా చర్యలు, పలు అంశాలపై కలెక్టర్‌తో ఎమ్మెల్యే చర్చించారు. ఎమ్మెల్యే వినతి మేరకు సత్వరమే వాటి పరిష్కారానికి చర్యలుతీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు కుమార్‌రాజా తెలిపారు. కార్యక్రమంలో కృష్ణాడెల్టా సాగునీటి ప్రాజెక్టు వైస్‌చైర్మన్‌గణేష్ పాల్గొన్నారు.


సమస్యలపై చర్చిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

అన్న క్యాంటీన్‌లో పేదలకు భోజనం

గుడివాడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు లయన్స్ మెల్విన్ జోన్స్ జన్మదినోత్సవం సందర్భంగా జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి పిలుపు మేరకు లయన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ ప్రగతి ఆధ్వర్యంలో 3రోజులపాటు అన్న క్యాంటీన్‌లో పేదలకు భోజనాలను అందజేయనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు నల్లారి శేషగిరిరావు తెలిపారు. శుక్రవారం స్థానిక పార్కు సమీపంలోని అన్న క్యాంటీన్‌లో జిల్లా లయన్స్ అదనపు కార్యదర్శి సనకా సుబ్బారావు వితరణతో భోజనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోకవరపు సునీల్, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, క్లబ్ కార్యదర్శి అన్నే నవీన్, సభ్యులు వీరశేఖర్, రామదేను వేణుబాబు, కృష్ణంరాజు, మాదాల సురేష్, వల్లభనేని శ్రీనివాసరావు, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.


భోజనాలను అందజేస్తున్న నిర్వాహకులు


గర్భిణులు, బాలింతలకు ఆకు కూరలు అందజేస్తున్న సుభాషిణి

గర్భిణులు, బాలింతలకు ఆకుకూరలు అందజేత

నందివాడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ గుడివాడ ప్రాజెక్టు పరిధిలో నందివాడ-3 అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి విజయ ఫ్లోరెన్స్ పోషణ వాటికకు సెలక్టు అయిన అంగన్‌వాడీ కేంద్రంలో సేంద్రీయ పద్ధతిలో పండించిన తాజా ఆకుకూరలను గర్భిణులు, బాలింతలకు అందజేసినట్లు సుభాషిణి తెలిపారు. సూపర్‌వైజర్ నాగ శిరీష, వెంకట రమణ, లక్ష్మీ, అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ప్రణాళికల రూపకల్పన నిమిత్తం గ్రామ సభలు

● ఎంపీడీవో సీతామహాలక్ష్మి

పెదపారుపూడి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీలలో ఆయా గ్రామాల సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు, వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు రూపకల్పన నిమిత్తం ఈ గ్రామసభలు అని ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. మండల కేంద్రమైన పెదపారుపూడి గ్రామపంచాయతీలో సర్పంచ్ చప్పిడి సమీరా అధ్యక్షతన సమావేశం జరిగింది. కార్యదర్శి సురేంద్ర చౌదరి మాట్లాడుతూ ప్రిపరేటరీ సభలలో మొదలైన ప్రాసెస్ ఈ నెలాఖరు తుది గ్రామసభలతో ముగుస్తుందని తెలిపారు. గ్రామాలలో ప్రస్తుతం ఉన్న పంచాయతీ అభివృద్ధి సూచికల స్థాయిని బట్టి ప్రభుత్వం నిర్దేశించిన తొమ్మిది థీమ్స్‌లో ఒక థీమ్ చొప్పున సంకల్పం చేసుకుని బడ్జెట్‌లో పొందుపరిచి తగినన్ని నిధులు కేటాయించటం జరుగుతుందని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుపై విచారణ

పామర్రు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివరామథియేటర్ కాంప్లేక్సుగల ఎలక్ట్రికల్ దుకాణంలో కుళాయికి సంబంధించిన పైపులు కొనుగోలు విషయంలో కొనుగోలుదారుడు,విక్రయదారుడి మధ్యతలెత్తిన వివాదంలో స్థానిక కంచర్లవానిపురం చెందిన మంతెన నాగమల్లేశ్వరరావు (28)ను కులం పేరుతో దుకాణ యాజమాని కాసాని శ్రీనివాసరావు(52) దూషించాడని ఈనెల 6రాత్రి పామర్రు ఎస్సై రాజేంద్రప్రసాద్‌కు ఫిర్యాదు చేశాడు.దాంతో ఎస్సై ఎస్సీఎస్టీ అట్రాసిటి చట్టం కింద కేసునమోదు చేశారు. సంబందిత కేసు దర్యాప్తులో భాగంగా బందరు డిఎస్పీ ఎండి అబ్దుల్ సుభాన్ శుక్రవారం సంఘటన సల్దాన్ని పరిశీలించి, సాక్షులను విచారణ చేశారు. అనంతరం శ్రీనివాసరావుపై అట్రాసిటి కేసునమోదు చేసినట్లు విలేఖర్లకు డిఎస్పీతెలిపారు.


విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలి - సీపీఎం

గుడివాడ, జనవరి 10(ఆంధ్రజ్యోతి) : పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని, స్మార్ట్ మీటర్‌లను పెట్టవద్దని, ట్రూఆప్ చార్జీల పేరిట వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని, అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను వెంటనే రద్దు చేసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక బేతవోలు, కార్మికనగర్ సెంటర్‌ల్లో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేపాని కొండ, చల్లా రాంబాబు, లంకా సురేంద్ర, విజయకుమార్ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు

సీసీ రహదారి పనుల పరిశీలన

పెదపారుపూడి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమంలో మంజూరైన సిమెంట్ రోడ్లకి మండల కేంద్రమైన పెదపారుపూడి గ్రామంలో రూ.5 లక్షలు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల ద్వారా సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభించారు. ఏఈ మోహన్‌రావు, టీడీపీ నాయకులు చప్పిడి కిషోర్ పనులను పరిశీలించారు.




కోలాటమాడుతున్న విద్యార్థినులు


ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు


గంగిరెద్దుల విన్యాసాలు


కబడ్డీ పోటీల్లో పాల్గొన్న యువత

ఘనంగా సంక్రాంతి సంబరాలు

గుడివాడ, జనవరి 10(ఆంధ్రజ్యోతి) : స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో ఉత్సాహంగా పాల్గొన్నారు. గంగిరెద్దు, భోగి మంటలు, చెరకు గడలు, పాలపొంగులతో రంగు రంగుల మట్టి కుండలు,సిరిమువ్వలతో ప్రతిధ్వనించే గంటల సవ్వడి, హరిదాసుల వస్త్రధారణలో విద్యార్థులు సందడి చేశారు. గొబ్బెమ్మలచుట్టూ తిరుగుతూ గొబ్బి పాటలు పాడే బాలికలు, పట్టుపంచెలతో పండుగ నాటి గ్రామీణ రైతులను తలపించే బాలురు, గాలిపటాల పోటీ నడుమ విద్యార్థులు సంక్రాంతి సంబరాలను జరుపుకున్నారు. సంప్రదాయ పిండివంటల స్టాళ్లను ఏర్పాటు చేశారు. బాలికల ప్రాంగణాన్ని రంగవల్లులతో తీర్చిదిద్దారు. కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండరామయ్య, డైరెక్టర్ బి.కళ్యాణ్‌కుమార్, ప్రిన్సిపాల్ డా.ఎస్.హెచ్.వి ప్రసాదరావు, డీన్‌లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, పాల్గొన్నారు.

స్థానిక ఎన్‌టీఆర్ స్టేడియంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్,పాల్గొన్నారు.

స్థానిక కేటీఆర్ మహిళా కళాశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ముగ్గుల పోటీలను నిర్వహించారు. విజేతలకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ బహుమతులను అందజేశారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు పుస్తకాలు, మెమోంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సంస్థ జిల్లా అధ్యక్షుడు దండమూడి జయలక్ష్మీ, గుడివాడ కార్యదర్శి నందమూరి పద్మజ, కళాశాల కరస్పాండెంట్ నిర్మల, ప్రిన్సిపాల్ సుష్మ, మానవతా గుడివాడ చైర్మన్ పిన్నమనేని వేణుగోపాలరావు, కార్యవర్గ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక ఫాదర్ బియాంకి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి రంగవల్లులతో అలంకరించి, సంక్రాంతి సంబరాలు, భోగి మంటలు, గంగిరెద్దుల సన్నాయి వాయిద్యాలు, ముత్యాల ముగ్గులు, గుమ్మడిపూలు, గొబ్బిళ్లతో అలంకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిస్టర్ అంజలి మాట్లాడారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన ఉపాధ్యాయులు, విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

కూచిపూడి: గ్రామాలు సంక్రాంతి శోభను సంతరించుకున్నాయి. వాకిళ్ల ముందు రంగవల్లులు తీర్చిదిద్ది గొబ్బెమ్మలను అలంకరిస్తున్నారు. విద్యార్థులకు సెలవులు ప్రకటించటంతో ఆటపాటలతో సెలవులను ఆస్వాదిస్తున్నారు. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసు కీర్తనలతో పల్లెలు నూతన శోభను సంతరించుకున్నాయి.



బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	112, 120, 131
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.515

మండల కమిటీలు ఏర్పాటు చేయాలి

మచిలీపట్నం టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : మహిళా ఉద్యోగుల సమస్యల సాధనకు మహిళలతో మండల కమిటీలు ఏర్పాటు చేయాలని మహిళా చైర్‌పర్సన్ నిర్మలాకుమారి అన్నారు. మహిళా ఉద్యోగులను సంఘటిత పరిచే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మచిలీపట్నంలో పర్యటించారు. ఏపీ ఎన్‌జీజీవోస్ ఏపీఎన్‌జీఓస్ సమావేశపు హాలులో జరిగిన సమావేశంలో నిర్మలాకుమారి మాట్లాడుతూ, మహిళా సమస్యలను రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కన్వీనర్ పి. మాధవి, రాజ్యలక్ష్మి, ఎ.వి.రమణ, కె. గౌరి, రజని, జాస్మిన్, రమాదేవి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

మచిలీపట్నం టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : చేపల చెరువుల మీద కాపలా ఉంటున్న ఒరిస్సాకు చెందిన ధృవ (25) అనే యువకుడు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. బందరు మండలం పెదపట్నంలో తమ్ము సత్యనారాయణకు చెందిన చెరువులపై ధృవ కొంత కాలంగా కాపలా ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం చెరువు దగ్గర మోటారు స్విచ్ ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మార్గ మధ్యంలోనే మృతి చెందాడు.

వైభవంగా ముక్కోటి ఏకాదశి

● తెల్లవారు జాము నుంచే ఉత్తర ద్వార దర్శనానికి తరలివచ్చిన భక్తులు




బందరుకోట రామాలయంలో మంత్రి కొల్లు రవీంద్ర, నీలిమ దంపతుల పూజలు.. శ్రీకాకుళంలో ఉత్తర ద్వారం గుండా బయటకు వచ్చిన స్వామివారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, యార్లగడ్డ శివరామప్రసాద్ తదితరులు

మచిలీపట్నం టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలోని వైష్ణవ దేవాలయాల్లో శుక్రవారం భక్తి శ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు జరిగాయి. ఉత్తర ద్వారం ద్వారా భక్తులు స్వామిని దర్శించుకున్నారు. బందరు కోట కోదండ రామాలయంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఆయన సతీమణి కొల్లు నీలిమ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. బచ్చుపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారు జాము నుంచే భక్తులు బారులు తీరారు. ఆలయ పాలక మండలి చైర్మన్ ముత్తేవి రవికాంత్, ఆలయ ఈవో సమ్మెట ఆంజనేయస్వామి పర్యవేక్షించారు. నగరవీధుల్లో స్వామి వారిని దివ్య రథంపై ఊరేగించారు.

ఘంటసాల: శ్రీకాకుళంలో శ్రీకాకుళేశ్వరస్వామి ముక్కోటి పర్వదినం సందర్భంగా ఉత్తర ద్వార దర్శనమిచ్చారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని దేవాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శుక్రవారం తెల్లవారుజామున సుప్రభాత సేవతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చల్లపల్లి రాజా వంశీయులు యార్లగడ్డ శివరామ ప్రసాద్ కుటుంబసభ్యులు తొలిపూజకే స్వామిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, విజయలక్ష్మి, వెంకట్రామ్, సాయిసుప్రియ దంపతులు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.



చల్లపల్లిలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

చల్లపల్లి : చల్లపల్లిలోని గరుడ ఆంజనేయ సహిత వేంకటేశ్వరస్వామి దేవాలయానికి ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు బారులుతీరారు. భక్తులు శుక్రవారం పెద్దఎత్తున తరలివచ్చారు. ఆలయ కమిటీ పెద్దలు మోపిదేవి ద్వారకానాథ్, పత్రి హనుమంతరావు, నూజెళ్ల బాబు, ఉప్పాల ఏడుకొండలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అవనిగడ్డ రూరల్ : పులిగడ్డలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ (రాజా), సాయి సుప్రియ దంపతులు స్వామిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. వేకనూరులో సంతాన వేంకటేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు ఉత్తర ద్వార ద్వారా స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

మోపిదేవి : కె.కొత్తపాలెం, పెదకళ్లేపల్లి గ్రామాల్లో వేణుగోపాలస్వామి దేవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనం భక్తులు పోటీలు పడ్డారు. కె.కొత్తపాలెంలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం, పెదకళ్లేపల్లి, మదన గోపాలస్వామి ఆలయాల్లో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ఉత్తర ద్వారదర్శనం కల్పించారు.

నాగాయలంక : నాగాయలంకలోని సబ్బినేని వారి బజారులో కోదండ రామాలయంలో ఉత్తర ద్వార దర్శన కార్యక్రమాలు జరిగాయి. భక్తులు వేకువజాము నుంచే ఉత్తర ద్వారం కొలువైన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మశ్రీ మురళీకృష్ణ, పవన్ కుమార్ స్వామివారికి విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

కోడూరు : ఉల్లిపాలెం గోదా రాజ్యలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ స్వామిని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దంపతులు దర్శించారు. ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలి వెంకట్రామ్ దంపతులు స్వామిని దర్శించుకున్నారు. ● కోడూరు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఉత్తర ద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వామిని దర్శించేందుకు భక్తులు వేకువజాము నుంచే ఆలయం వద్ద బారులు తీరారు.

పెడన రూరల్ : కొప్పల్లిలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామివారికి సుప్రభాత సేవ, అభిషేకాలు నిర్వహించి భక్తుల ఉత్తర ద్వార ద్వారా దర్శించుకున్నారు. చెన్నూరులోని లక్ష్మీనరసింహస్వామి, చేవేంద్రలోని మదన వేణుగోపాలస్వామి ఆలయాల్లో, పెనుమల్లి, కాకర్లమూడి, నందమూరు, చెన్నూరు, ఉరివి, లంకలకలవగుంట, నందిగామ, బల్లిపర్రు, కోటావాని పాలెం గ్రామాల్లోని రామాలయాల్లో స్వామివారిని భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు.

పెడన : పెడనలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. మునిసిపల్ మాజీ చైర్మన్లు బొడ్డు వేణుగోపాలరావు, పద్మజాకుమారి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బళ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ : అవనిగడ్డలో పురాతనమైన వైష్ణావాలయమైన లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు ఈ వేడుకలను పర్యవేక్షించారు.

బంటుమిల్లి : బంటుమిల్లి రామాలయం, గోదాదేవి పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి తదితర ఆలయాల్లో భక్తులు తెల్లవారు జాము నుంచే స్వామివారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. పుర వీధుల్లో స్వామి వారి గ్రామోత్సవం ఘనంగా జరిగింది.

కృత్తివెన్ను : లక్ష్మీపురం గ్రామంలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారు నవనీత అంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దాతల సహకారంతో 2 కేజీల వెన్న, 6 కేజీ డ్రైఫ్రూట్స్‌తో స్వామి వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనమిచ్చారు.



అవనిగడ్డలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

చివరి భూములకూ సాగునీరు లక్ష్యం కావాలి

చల్లపల్లి డిస్ట్రిబ్యూటరీ కమిటీ సమావేశంలో నాయకులు

చల్లపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి కోసం రైతులు ఇబ్బందులు పడకుండా సమన్వయంతో పనిచేస్తూ కాల్వ చివరి భూములకు సాగునీరందించటమే లక్ష్యంగా నీటి సంఘాలు పనిచేయాలని చల్లపల్లి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్ కోరారు. చల్లపల్లి జలవనరులశాఖ కార్యాలయంలో చల్లపల్లి డిస్ట్రిబ్యూటరీ కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా డీసీ చైర్మన్ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వం నీటిసంఘాల ఎన్నికలు నిర్వహించటం ద్వారా సాగునీటి రంగానికి ప్రాధాన్యతను కల్పించిందన్నారు. ఇరిగేషన్, డ్రెయినేజీ శాఖలను సమన్వయం చేసుకుంటూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా నీటి సంఘాలు కృషి చేయాలన్నారు. సమావేశంలో చర్చించి ప్రణాళిక రూపొందించారు. చల్లపల్లి డీసీలోని 11 సంఘాల పరిధిలో 35 పనులు రూ.12.30కోట్లతో చేపట్టాలని అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు తెలిపారు. ఇరిగేషన్ డీఈ పి.వెంకటేశ్వరరావు, ఏఈలు వి.రామ్ కుమార్, పి.రవితేజ, డ్రైనేజీ శాఖ చల్లపల్లి డీఈ జె.బాబూనాయక్, బందరు డీఈ కిరణ్‌బాబు, ఏఈలు పి.చిరంజీవి, నజ్మారాణి నీటిసంఘాల అధ్యక్షులతో చర్చించారు. డీసీ వైస్‌చైర్మన్ చిల్లా సీతారామయ్య, నీటి సంఘాల అధ్యక్షులు గొరిపర్తి సుబ్బారావు, మత్తి నాగ మల్లేశ్వరరావు, నూకల నరేష్‌కుమార్, చలమలశెట్టి వెంకట రమణారావు, కేసన రమేష్, గంజాల శ్రీరాములు, పిచ్చేశ్వరరావు, దుర్గానాగేశ్వరరావు పాల్గొన్నారు.



అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

నాలుగు లక్షల నగదు, బంగారం అగ్నికి ఆహుతి

చల్లపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : మంగళాపురం బీసీ కాలనీలో గొరిపర్తి శ్రీనివాసరావుకు చెందిన పూరిల్లు శుక్రవారం అగ్నిప్రమాదంలో దగ్ధమై ఆస్తి నష్టం జరిగింది. మినుములు అమ్మగా వచ్చిన రూ.4లక్షలు ఇంటిలో ఉంచటంతో ప్రమాదంలో వాటితోపాటు బంగారం, వస్తుసామగ్రి, ఇంటి పత్రాలు కాలిపోయాయని బాధితుడు ఆవేదన వ్యక్తంచేశాడు. శ్రీనివాసరావు కూలీపనికి పోగా, భార్య, దివ్యాంగురాలైన కుమార్తె ఇంటిలో ఉన్నారు. మంటలు ఒక్కసారిగా చుట్టుముట్టడంతో మంటలను చూసిన భార్య, కుమార్తెను బయటకు తీసుకువెళ్లింది. స్థానికులు మంటలను అదుపుచేయగా, అవనిగడ్డ అగ్నిమాపక అధికారులు సిబ్బందితో మంటలను ఆర్పివేశారు. వీఆర్వో మల్లేశ్వరి ప్రమాదనష్టంపై తహసీల్దార్‌కు నివేదిక అందజేశారు. ఈ ప్రమాదంలో రూ.9లక్షలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు అంచనావేశామని అగ్నిమాపక అధికారి ప్రసాద్ తెలిపారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

మచిలీపట్నం టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రతి పేదవాడికి పట్టణాల్లో రెండు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సీపీఐ నాయకులు శుక్రవారం 46వ డివిజన్ సచివాలయ ఇన్‌చార్జి శిరీషకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు రామారావు, ఓడుగు చైతన్యకుమార్, యర్రంశెట్టి ఈశ్వరరావు, మహిళా సమైక్య నాయకురాలు ఒడుగు రత్నకుమారి, నాగబాబు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షించాలి

అవనిగడ్డ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని హిందూ ధార్మిక సంఘాలు అవనిగడ్డలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రభుత్వాన్ని కోరాయి. టీటీడీ ఉత్తర ద్వార దర్శన టిక్కెట్ల కోసం క్యూ లైన్‌లో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు చనిపోయారని టీటీడీ పాలక మండలి దీనికి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. హిందూ సంఘాల నేతలు కోలా శ్రీమన్నారాయణ, తుంగల వెంకటగిరి, భూపతి సుబ్రహ్మణ్యం, భోగాది చంద్రశేఖర్, వేములల నరసింహారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

మచిలీపట్నం టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను చేపట్టాలని పీఆర్‌టీయూ ఎన్టీఆర్, కృష్ణాజిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నవాబ్‌జాని, రాఘవరాజు, పెద్దిబోయిన శ్రీనివాసరావు, మనోహర్ డిమాండ్ చేశారు. జడ్పీ కార్యాలయంలో శుక్రవారం డిప్యూటీ సీఈవో ఆనందబాబుకు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల పీఎఫ్ పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 72 కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలన్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోసూరి రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ల రమేష్‌బాబు, బి. మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమమే లక్ష్యం

కోడూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పాడిరైతుల సంక్షేమాభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. హరిపురంలో గ్రామంలో శుక్రవారం నూతనంగా నిర్మించిన మినీ గోకులం షెడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. గత వైసీపీ పాలనలో గోకులం షెడ్లను పూర్తి విస్మరించిందన్నారు. కార్యక్రమంలో మండలి వెంకట్రామ్, పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సుధా ప్రవీణ్, సర్పంచ్ వెర్రి పావని పాల్గొన్నారు.

కృత్తివెన్ను : సంగమూడిలో మినీ గోకులాన్ని శుక్రవారం ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ప్రారంభించారు. రైతులకు ఈ షెడ్డులు ఏంతో మేలు చేకురుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఒడుగు తులసీరావు, పిన్నెంటి రత్తయ్య, నాగమల్లేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



విశ్వభారతిలో సంక్రాంతి సంబరాలు

పెడన, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విశ్వభారతి హైస్కూల్‌లో శుక్రవారం సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. బొమ్మల కొలువు ఏర్పాటు చేసి ప్రతి బొమ్మ ప్రాధాన్యతను వివరించారు. ఉపాధ్యాయినులు చిన్నారులకు భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. హైస్కూల్ ప్రిన్సిపాల్ అనుమకొండ గౌరీప్రసాద్ పర్యవేక్షించారు.

రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి



రీ సర్వేపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మోపిదేవి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం.శ్రీవిద్య తెలిపారు. దీర్ఘకాలంగా రైతులు భూములకు సంబంధించి ఏర్పడిన సమస్యల పరిష్కారానికై రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సత్వర పరిష్కారానికి ప్రభుత్వం రీ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులకు సంబంధించిన పత్రాలను రెవెన్యూ అధికారులకు సమర్పించి, భూముల హద్దులు నిర్వహించుకోవచ్చునని తెలిపారు. మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు నడకుదుటి జననీ కుమారి, మండల సర్వేయర్, ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వో ప్రశాంత్ పాల్గొన్నారు.

నాగాయలంక: నాగాయలంక పంచాయతీలోని భూములకు రీ సర్వే నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎం.హరనాథ్ తెలిపారు. రీ సర్వేకు సహకరించాలని కోరుతూ శుక్రవారం నాగాయలంక సెంటర్‌లో సర్వేయర్లు, వీఆర్వోలు అవగాహన ర్యాలీని నిర్వహించారు. నాగాయలంక పంచాయతీ రీ సర్వేకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికయిందన్నారు. సర్వే చేసిన భూములకు హద్దులు నిర్ణయించటంతోపాటు రైతులకు పట్టాదారులు కొత్తవి జారీ చేస్తారన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు




కొడాలిలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధికారులు..మాట్లాడుతున్న తహసీల్దార్ ఎం.హరనాథ్

ఘంటసాల, జనవరి 10 (ఆంధ్ర జ్యోతి): మండలంలో కోడిపందేలు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచ్‌లు ప్రజలకు అవగాహన కల్పించారు. కొడాలి పంచాయతీ కార్యాలయం వద్ద కార్యదర్శి సి.హెచ్.వి.ఎస్.నాగమణి మాట్లాడుతూ, కోడిపందేల నిర్వహణకు అనుమతులు లేవన్నారు. గ్రామ కమిటీ సభ్యులతో కరపత్రాలు ఆవిష్కరించారు. గ్రామంలో పందేలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే గ్రామ కమిటీ సభ్యులు వెంటనే సమాచారం అందించాలని కార్యదర్శి సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో పి.శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ కమలాకరరావు, వెటర్నరీ ఉద్యోగి కె.గోపిబాబు పాల్గొన్నారు. **నాగాయలంక :** సంక్రాంతి సందర్భంగా మండలంలో కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎం.హరనాథ్ హెచ్చరించారు. శుక్రవారం కార్యాలయంలో ఎంపీడీవో సీతారామ్‌కుమార్, ఎస్సై కె.రాజేష్, ఈవోపీఆర్డీ కె.అప్పలనరసమ్మతో తహసీల్దార్ సమావేశాన్ని నిర్వహించారు.